ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 8 | ఏప్రియల్ 2021

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ఈ సంచికలో....

04-12-1987 శృంగవృక్షం

భగవద్గీత

అక్షరమణమాల

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 04 డిసెంబర్ 1987, శృంగవృక్షం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజున బ్రహ్మదేవుడికి విష్ణుదేవుడికి ఈశ్వరుడు జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చినటువంటి రోజు. ఎందుకు దర్శనం ఇచ్చాడు? బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి దర్శనం ఇవ్వవలసిన అవసరం ఈశ్వరుడికి ఎందుకు వచ్చింది అంటే, మన ఇంటిలో అయినా, మన ఊరులో అయినా, మన దేశంలో అయినా, ప్రపంచంలో అయినా అశాంతికి, అల్లకల్లోలానికి కారణం మానవుడి యొక్క అహంకారం. బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి నేను గొప్ప అంటే నేను గొప్ప అని అహంకారం వచ్చింది. వాళ్ళ అహంకారం లోకానికి కల్లోలం తీసుకు వచ్చింది. లోకానికి అశాంతి తీసుకు వచ్చింది. దానిని అణచటానికి ఈశ్వరుడు జ్యోతిరూపంలో వచ్చాడు. మన దుఃఖానికి కారణం కూడా అహంకారమే. మన హృదయంలో ఉన్న దైవ స్వరూపాన్ని, ఆత్మ స్వరూపాన్ని, మన హృదయంలో ఉన్న శాంతిని, మోక్షాన్ని మనకి దొరక్కుండా చేసేది మన అహంకారమే, ఎవరో దేవుడు కాదు. మనం ఏమి చేస్తున్నాం అంటే ఈ అహంకారాన్ని సూటిగా వెతకటం మానేసి దేనివల్ల మనకి అశాంతి వస్తుందో, దేనివల్ల మనకి దుఃఖం వస్తుందో, దేనివల్ల మనకి కష్టము, నష్టము ఇవన్నీ వస్తున్నాయో దానిని మనం సూటిగా ఎదుర్కోలేక అహంకారం కల్పించిన వస్తువులను వెతుకుతున్నాం. మనకు లోపలికి దిగటం చేతకాదు అందుచేత బయట వెతుకుతున్నాం.

రమణస్వామి ఈశ్వరుడికి శరణాగతి పొందాడు అంటే, ఈశ్వరుడు ఆ కొండా కాదు, ఆ లింగమూ కాదు. సర్వాంతర్యామిగా ఉన్నటువంటి, చైతన్య రూపములో ఉన్నటువంటి పరబ్రహ్మనే ఆయన శరణాగతి పొందాడు. ఆత్మ అంతటా ఉన్నది, సర్వాంతర్యామి, సర్వజ్ఞత్వం. దానికి మొదలు లేదు, చివర లేదు. ఈశ్వరతత్వానికి ఆరంభం అంటూ లేదు, దానికి ముగింపు అంటూ లేదు, అయితే మనం దేహమాత్రులం కాబట్టి ఈశ్వరుడికి కూడా ఒక విగ్రహం చేసి చూడటం మనకి అలవాటు అయిపోయింది. మనందరికీ దేహం ఉంది. మనకి లోకం ఒకటి కనిపిస్తోంది. దేహం లేకుండా లోకాన్ని చూసిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? జ్యోతి స్తంభరూపంలో ఉన్న ఈశ్వరుణ్ణి నిన్ను అర్చన చేసుకోవటం ఎలాగ అని అడిగారు? ఈ జ్యోతి స్తంభాన్ని ఎలా ఆరాధించటం? అని బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు ప్రార్థిస్తే ఆ జ్యోతి స్తంభాన్ని ఉపసంహరించి అరుణగిరిరూపం ధరించాడు. అరుణగిరిని మళ్ళీ అర్చన చేసుకోటానికి లింగరూపం ధరించాడు. ముందు జ్యోతి స్తంభంగా అవతరించాడు. ఆ జ్యోతి స్తంభమే తరువాత గిరిరూపం ధరించింది. తరువాత అర్చన చేసుకోటానికి లింగరూపం ధరించింది. ఇక్కడ ఇంకొక విశేషం ఏమిటి అంటే అరుణాచలం కొండ మీద ఈశ్వరుడు శరీరధారుడై అరుణగిరి యోగిరూపంలో ఉన్నాడు. ఒకటి లింగరూపం, రెండు గిరిరూపం, మూడు సిద్ధరూపం అంటే అరుణగిరి యోగిగా, మానవ శరీరం ధరించి ఆ కొండ మీద ఉన్నాడు. అంటే మూడు రూపాలలో ఉన్నాడు. ఈ రోజున బ్రహ్మవిష్ణువుల యొక్క అహంకారాన్ని తొలగించటం కోసం జ్యోతి స్తంభరూపంలో దర్శనం ఇచ్చాడు కాబట్టి దానికి గుర్తుగా ఈ రోజున అరుణాచలంలో జ్యోతి వెలిగిస్తారు.


ఉన్నది నలుబది సద్విద్య అని భగవాన్ కొన్ని మాటలు చెప్పారు. ఆ మాటలు కొన్ని చదివి మీకు వినిపిస్తాను. నేను అని ఈ దేహం పలుకదు. మనమందరము నేను నేను అంటున్నాము. ఈ నేను అనేది ఎవరు అంటున్నారు? ఈ దేహం అంటుందా? మన యొక్క దుఃఖానికి కారణం ఈ నేనే, మనం ఏదైతే నేను నేను అని అంటున్నామో ఈ నేనే మనస్సు. ఈ నేనే అహంకారము. కాని నేను అని దేహం మటుకు అనటం లేదు. మరి ఎవరు అంటున్నారు? నాలో ఉన్న మనస్సు అనండి, లేకపోతే అహంకారం అనండి, లేకపోతే బుద్ధి అనండి ఏదోకటి నేను అంటోంది లోపలి నుంచి, కాని దేహం అనటం లేదు నేను నేను అని. అందరం నేను అంటున్నాం. ఆ నేను ఎవరో మనకి తెలియదు. దీనికి మీరు నాస్తికులా,

ఆస్తికులా అని సమస్య ఏమీ లేదు. మనమందరం నేను నేను అని అంటున్నాం. ఈ నేను యొక్క సోర్స్ ఒకటి లోపల ఉంది, ఆ మూలాన్ని తెలుసుకునే వరకు మీరు ఏ దేవుణ్ణి చూసినా మీకు అజ్ఞానం పోదు. మీరు దేవుణ్ణి చూడటం ప్రధానం కాదు. ఏదో మహిమలు సంపాదించటం ప్రధానం కాదు. ఏదో శక్తులను సంపాదించటం ప్రధానం కాదు. నేను నేను అని ప్రతిమనిషి అంటున్నాడు. ఈ నేను యొక్క మూలం మీ హృదయంలోనే ఉంది. హృదయంలో ఉన్నటువంటి నేను యొక్క మూలాన్ని నువ్వు గ్రహించు. అప్పుడు నీకు ఆత్మ దర్శనం అవుతుంది. అంతేగాని ఆ నేను యొక్క మూలం నీకు తెలియకుండా నేను ఎక్కడో లోకానికి వెళ్లి వచ్చాను. నేను దేవుణ్ణి చూశాను అంటే అదంతా నిజం కాదు అదంతా స్వప్నం మాత్రమే, అది రమణస్వామి చెప్పేది. ఆ నేను యొక్క సోర్స్ నీకు తెలియకపోతే, ఆ నేను యొక్క మూలం గనుక నీకు తెలియకపోతే, దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది మిమ్మల్ని, దేహాలు వెంటాడుతూ ఉంటాయి, మరణించటం తప్పదు, మళ్లీ జన్మించటం తప్పదు. ఎప్పటి వరకు? ఆ నేను యొక్క మూలం తెలుసుకునేవరకు ఇవన్నీ తప్పవు.

నేను అని ఈ దేహం పలుకదు. ఈ దేహం జడమే కాని ఇది నేను అని ఎప్పుడు చెప్పటం లేదు. నిద్రయందు కూడా నేను లేనని ఎవరు చెప్పటం లేదు. మనం నిద్ర పోతున్నాం. అప్పుడు మనకి దుఃఖం లేదు, బంధం లేదు. గాఢనిద్రలో కూడా నేను ఉంది. అందుచేత మనం సుషుప్తావస్థలోంచి జాగ్రదావస్థలోకి వచ్చాక నాకు బాగా నిద్ర పట్టింది. రాత్రి నాకు స్వప్నం రాలేదు. నాకు చాలా సుఖంగా ఉంది అని గాఢనిద్రలోంచి జాగ్రదావస్థలోకి వచ్చాక మనం చెబుతున్నాము. అంటే నేను ఒకటి చూస్తోంది. అక్కడ లోకం లేదు, అక్కడ దేవుడు లేడు, అక్కడ శరీరం లేదు, అక్కడ బంధువులు లేరు, బంధాలు లేవు, నరకం లేదు, స్వర్గం లేదు, ఏ లోకాలు లేవు, గురువులు లేరు, శిష్యులు లేరు, ఎవరు లేరు. కానీ గాఢనిద్రలో మీరు ప్రశాంతంగా ఉన్నారు, మీకు దుఃఖం లేదు అక్కడ! నిద్రట్లో ఏమీ లేదు. కానీ మీరు ఉన్నారు. మీరు లేరని చెప్పగలరా? మీరు లేకపోతే మెలకువ వచ్చాక నాకు బాగా నిద్ర పట్టిందని ఎవరు చెబుతున్నారు? అందుచేత నిద్రట్లో కూడా మీరు ఉన్నారు. నేను ఒకటి పుట్టిన వెనుక అఖిలము పుట్టును. ఉదయం మనం లేవగానే దేహానికి సంబంధించిన నేను అనే తలంపు వస్తుంది. ఆ దేహ స్పృహ వచ్చిన తరువాత మనకి లోకం వస్తుంది. అక్కడ నుంచి ప్రార్థనలు, పూజలు, దేవుడు ఇవన్నీ వస్తాయి.

అందరూ కూడా నిద్ర కోరుతున్నారు. ఫ్యానులు వేసుకుంటున్నాము, పరుపులు మీద పడుకుంటున్నాము నిద్ర కోసం. ప్రతీ వ్యక్తి కూడా నిద్రట్లో మీకు తెలియకుండా మీరు సుఖాన్ని అనుభవిస్తున్నారు. మీకు తెలియకుండా మీ మూలానికి వెళుతున్నారు. నువ్వు నిద్రట్లో ఎలా ఉండగలుగుతున్నావో, అక్కడ నీకు తెలియకుండా ఉన్నావు. తెలిసి నువ్వు జాగ్రదావస్థలో అటువంటి స్థితిలోకి రా, ఆ స్థితిలోకి వస్తే అప్పుడు నీకు జ్ఞానం కలిగేది, సమాధి స్థితి కలిగేది. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే నేను లేనని ఎవరూ చెప్పట లేదు, నేను ఒకటి పుట్టిన వెనుక అఖిలము పుట్టును. ఈ నేను అనే తలంపు వచ్చిన తరువాతే లోకం వస్తుంది. ఈ నేను ఎక్కడ పుడుతోంది? అది నీ బుద్ధిచేత శోధించు. అంటే మనస్సుని అంతర్ముఖం చెయ్యి, అంటే మనం చేసే పూజల వల్ల, మనం చేసే జపాల వల్ల, మనం చేసే ధ్యానం వల్ల మనస్సు అంతర్ముఖం అవ్వాలి. మనస్సు సూక్ష్మం అవ్వాలి. బుద్ధి సూక్ష్మం అవ్వాలి. మనస్సుని అంతర్ముఖం చేయటం అంటే ఎలా చేయగలరు? పుణ్యకార్యాలు చేయటం వల్ల, త్యాగబుద్ధి ఉండటం వల్ల, పవిత్రంగా జీవించటం వల్ల, ఇంద్రియ నిగ్రహం వల్ల, మనో నిగ్రహం వల్ల మనస్సు అంతర్ముఖం అవుతుంది.

ప్రతీ మనిషికి సుఖం కావాలి. ప్రతీ మనిషికి శాంతి కావాలి. కాని శాంతి ఎక్కడ నుంచి వస్తుంది అనుకుంటున్నాం? లోకం నుంచి వస్తుంది అనుకుంటున్నాం. లోకం లోంచే సుఖం వస్తుంది అనుకుంటున్నాం. అందుచేత లోకం చూసి మనం ఆకర్షించబడుతున్నాం. మనం లోకాన్నే ప్రేమిస్తున్నాం, దేవుణ్ణి ప్రేమించటం లేదు. దేవుణ్ణి



**"ఎన్నో జన్మల నుండి గురువు వేరు, నేను వేరు అనుకుంటూ గురువు అంటే ఎక్కడో ఉన్నాడని అనుకున్నాను. కానీ మీరు బయట లేరు, నా హృదయంలోనే ఉన్నారని ఈనాటికి తెలిసింది. ఈ అనుభవం మీరే కలుగజేశారు. మీ ఋణం తీర్చుకోవటానికి నన్ను ఏం చేయమంటారు" అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగాడు. "గురువు నీ హృదయంలోనే ఉన్నాడనే అనుభవం నీకు కలిగింది ఆ అనుభవం నుండి జారకుండా అది స్థిరంగా అయ్యేలా చూసుకో. ఆ స్థితిలో ఉండిపో, అలా ఉంటే నా ఋణం తీర్చుకున్నట్లే అన్నారు" ఆ గురువు గారు.**

ప్రార్థించేటప్పుడు కూడా మన బుర్రలో ఉండేది లోకమే, ఈ వెంకటేశ్వర స్వామి బొమ్మ, రాముడి బొమ్మ, కృష్ణుడి బొమ్మ పెట్టుకుంటున్నారు మీరు, పెట్టుకుని నాకు ఈ కోరిక కావాలి, ఆ కోరిక కావాలి, ఇది నెరవేర్చు, అది నెరవేర్చు అని మీరు ప్రార్థిస్తున్నారు ఈశ్వరుణ్ణి, అలా ప్రార్థించేటప్పుడు మీకున్న కోరికలనే మీరు మననం చేస్తున్నారా లేక వేంకటేశ్వరస్వామిని ధ్యానం చేస్తున్నారా? మీ కోరికలను మీరు ధ్యానం చేసుకుంటున్నారు, మీ మనస్సుని మీరు ధ్యానం చేస్తున్నారు, మీ వాంఛలను మీరు ధ్యానం చేస్తున్నారు కానీ వేంకటేశ్వరస్వామిని కాదు. ఈశ్వరుడు పట్ల నాకు భక్తి ఉంది అనుకున్నపుడు కూడా లోకాన్నే ప్రేమిస్తున్నాం మనం, ఈశ్వరుణ్ణి కాదు, లోకంలో మనకున్న వాంఛలు నెరవేరటం కోసం ఈశ్వరుణ్ణి అడ్డు పెట్టుకుని నెరవేర్చమని మనం అడుగుతున్నాం. అంటే ఈశ్వరుణ్ణి ప్రార్థించేటప్పుడు కూడా మనం మననం చేసేది లోకాన్నే. భగవాన్ శ్రీ రమణమహర్షికి ఒకరూపం తోటి సంబంధం లేకుండా ఆయనకి experience వచ్చింది. ఆయనకి మృత్యువు వచ్చి పదహారో సంవత్సరంలో మీద పడింది. ఆ మృత్యువు వచ్చినప్పుడు ఆయనకి శ్వాస ఆగిపోయింది. శరీరం అంతా శవం అయిపోయింది. కాని శరీరానికి వేరు పడిపోయి పూర్తిగా, సాక్షిగా చూడగలుగుతున్నారు. ఇది పదహారో సంవత్సరంలో ఆయనకి వచ్చినటువంటి మృత్యు అనుభవం. దేహానికి పరిమితం అయిన నేనే అహంకారం. ఆయనకి పదహారో సంవత్సరంలో అహంకారం మరణించింది. అంటే దేహంలో శ్వాస ఉండగానే దేహానికి పరిమితం అయిన నేను మరణించాలి. వాడు జీవన్ముక్తుడు అవుతాడు. అందరికి మోక్షం కావాలి. ముక్తి అంటే ఎలా ఉంటుంది? ఎవరైనా చెబుతారా? మోక్షం అనేది మనసుకి అతీతం. మోక్షం అనేది అహంకారానికి అతీతం. మనస్సుకి అతీతమైన దానిని, అహంకారానికి అతీతమైన దానిని, వాక్కుకి అతీతమైన దానిని, మనం మనస్సుతోటి, వాక్కు తోటి చెప్పలేము. అసలు మోక్షం అనేది మానసిక పరిధిలోనిది కాదు, దేహం యొక్క పరిధిలోనిది కాదు, అహంకారం యొక్క పరిధిలోనిది కాదు. మోక్షం అహంకారానికి అతీతమైనది, మనస్సుకి అతీతమైనది, ఇంద్రియాలకి అతీతమైనది, బుద్ధికి అతీతమైనది. అందుచేత మనం ఆలోచించి చెప్పేది కాదు అది, అనుభవించేది. అయితే మోక్షం పొందటం కోసం మీరు శరీరం పోయే వరకు వాయిదాలు వేసుకోనక్కర్లేదు. శరీరం ఉండగానే, ఈ లోకంలోనే, ఈ దేహంలో ఉండగానే మీరు మోక్షాన్ని అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. ఇప్పుడు మీరు నన్ను ఎలా చూస్తున్నారు?

నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాను? అలాగరాముడో, కృష్ణుడో, శివుడో వచ్చి మీకు కనిపిస్తారు అనుకోండి అది మోక్షం కాదు. అది దృశ్యమే. ఏది మోక్షం? మీరు ఏదైతే నేను నేను అని అంటున్నారో, ఆ నేను యొక్క మూలం ఎప్పుడైతే మీరు చూశారో, ఆ నేను యొక్క మూలం ఎప్పుడైతే మీ అనుభవానికి చిక్కిందో అప్పుడు ఆ గడియలో మోక్షం మిమ్మల్ని వరిస్తుంది. మీరు దేవుణ్ణి చూడటం మోక్షం కాదు. ఎందుచేత దేవుణ్ణి చూస్తే దేవుణ్ణి చూసినటువంటి ఈ శరీరం ఎంతసేపు ఉంటుంది? మన కళ్ళకు కనిపిస్తున్న దేవుడు ఎంతసేపు ఉంటాడు? అందుచేత శాశ్వతమైన ఆనందం, శాశ్వతమైన శాంతి మీకు కావాలంటే మీలో ఉన్న నేను యొక్క మూలం మీకు తెలియాలి. దానికోసం భక్తి వల్ల ప్రయత్నం చేయవచ్చు. జ్ఞానం వల్ల ప్రయత్నం చేయవచ్చు. యోగం వల్ల ప్రయత్నం చేయవచ్చు. మీరు ఏదో ఒక మార్గంలో మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేయవచ్చు. ఏ మార్గంలో మీరు ప్రయాణం చేసినప్పటికీ ఆ నేను యొక్క మూలం మీకు తెలియబడాలి. ఆ source మీకు తెలియబడాలి.

రాగాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు, క్రోధాన్ని విడిచిపెట్టు అని భగవంతుడు వాసుదేవుడు చెప్పాడు. ఏవండీ ఈ నేను ఉన్నంతకాలం రాగం పోదు, భయం పోదు, క్రోధం పోదు. ఈ నేను నేను అంటే దేహానికి పరిమితమైన నేను ఉన్నంతకాలం రాగం విడిచిపెట్టదు, భయం విడిచిపెట్టదు, క్రోధం విడిచిపెట్టదు. నాకు దుఃఖం రావటానికి నా రాగం కారణం. నాకు భయం వేయకూడదు, నాకు భయం వేయకూడదు అనుకుంటున్నారు. కారణం ఏమిటి? భయం వేస్తే మీకు నష్టం ఏమిటి? భయం వస్తే దుఃఖం వస్తుంది. ఏవండీ ఈ నేను యొక్క మూలం తెలిస్తేనే కాని రాగం వెనక్కి తప్పుకోదు. భయం వెనక్కి తప్పుకోదు. ద్వేషం వెనక్కి తప్పుకోదు. ఈ నేను యొక్క మూలం తెలిసేవరకు భయం కానీ, రాగం కానీ, ద్వేషం కానీ, ఇవన్నీ వెనక్కి మళ్ళవు. అవి విజృంభిస్తూనే ఉంటాయి. మీరు దేవుణ్ణి ప్రార్థించటం వల్లో, లేకపోతే ఒక పది నిముషాలు పూజ చేయటం వల్లో, ఈ భయము, ఈ రాగము, ఈ ద్వేషము, తాత్కాలికంగా అణిగి ఉండచ్చును కానీ సమస్య పరిష్కారం కాదు. అది వెనక్కి శాశ్వతంగా మళ్ళదు. నేను యొక్క మూలం తెలుసుకునే వరకు అజ్ఞానం మనిషిని విడిచిపెట్టదు. పీడించేస్తుంది, అశాంతి పీడిస్తుంది, ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటంటే, మీకు అందరికి భక్తి ఉంది కాబట్టి మీరు ఎంతో శ్రద్ధగా చాలా దూరం నుంచి వచ్చారు. భక్తి దేనికి? అంటే నేను ఇంత గొప్పవాణ్ణి అని, లేకపోతే నేను ఇంత


ప్రార్థనలు చేస్తున్నాను అని, లేకపోతే నేను ఇంతసేపుధ్యానం చేస్తున్నాను అని ప్రకటించుకోవటానికా భక్తి? పబ్లిసిటీకా భక్తి? భక్తి దేనికి అంటే, ఈ నేను యొక్క మూలం తెలుసుకోవటం కోసమే భక్తి కావాలి. అహంకారం లేని స్థితిని సంపాదించుకోవటం కోసమే భక్తి కావాలి. మీ భక్తి అందుకు ఉపయోగపడుతోందా? మీరు బాగా ఆలోచించండి. ఏదైనా మీ కోరికలు నేరవేర్చుకోవటం కోసం మీరు సంపాదించిన భక్తిని ఖర్చు పెట్టుకుంటున్నారా లేకపోతే ఈ నేను యొక్క మూలం తెలుసుకోవటం కోసం భక్తి మీకు సహకరిస్తోందా? అది చూసుకోండి.

ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే ఈ నేను ఎక్కడ పుట్టింది అని సూక్ష్మబుద్ధి చేత శోధింపుము. జడ శరీరం నేను అని అనదు. ఈ శరీరం నేను నేను అని అనదు. ఈ శరీరం నేను నేను అంటే శవం కూడా నేను అనాలి. ఈ శరీరంలోంచి ప్రాణంపోయాక ఈ అరటిచెట్టు ఎంతో, ఈ స్తంభం ఎంతో, ఈ మైక్ ఎంతో ఈ శరీరం అంతే. శరీరం నేను అని అనదు. శవం నేను అని అంటుందా అండి ఎక్కడైనా? శవం నేను అని అనదు. ఆత్మ కూడా నేను నేను అని అనదు. నడిమి మధ్య దేహ పరిమాణముగా నేను ఒకటి పుట్టును. అదే గ్రంధి, అదే బంధము, అదే జీవుడు, అదే సూక్ష్మశరీరం, అదే అహంకారం, అదే సంసారం, అదే మనస్సు మొదలైనవని తెలియును. రమణమహర్షి ఎంత వివరంగా చెప్పారో చూడండి. ఏదైతే నేను నేను అని నువ్వు అంటున్నావో, ఏదైతే దేహానికి పరిమితం అయిన నేనో, ఏదైతే మనసుకి పరిమితం అయిన నేనో, ఏదైతే నీ బుద్ధికి పరిమితం అయిన నేనో, ఏదైతే నీ ఇంద్రియాలకి పరిమితం అయిన నేనో, అదే బంధము. బంధం అంటే మీ ఇంట్లో ఉన్న సంసారం బంధం కాదు. మీ ఇంట్లో ఉన్న పిల్లలు బంధం కాదు. ఏది బంధము? ఈ నేను నేను అనేదే నిజమైన బంధము. జీవుడు అంటే ఎక్కడో లేడు, వాడికి గడ్డాలు, మీసాలు లేవు జీవుడికి. ఈ నేను నేను అని ఎవడినైతే అంటున్నావో ఆ నేనే జీవుడు. అదే సూక్ష్మశరీరం. ఈ కనిపిస్తున్న శరీరం ఇది స్థూల శరీరం. వేదాంత పరిభాషలో మనస్సుని సూక్ష్మశరీరం అంటారు. సూక్ష్మశరీరం లోపల ఇంకొక శరీరం ఉంది. అది కారణ శరీరం. అదేమిటి? అజ్ఞానం. అజ్ఞానం ఉన్నంతకాలం ఈ సూక్ష్మశరీరం, స్థూల శరీరం ఇవి రెండు శరీరాలు తప్పవు. కారణం ఉన్నంత సేపు ఇవి రెండు శరీరాలు వస్తూనే ఉంటాయి. సంసారం అంటే ఈ బయట ఉన్న ప్రపంచము, ఇంట్లో ఉన్న వ్యక్తులు సంసారం కాదు. నువ్వు ఏదైతే

నేను నేనుఅంటున్నావో, అదే సంసారం. అందుచేత ఆ నేనుని మనం విడిచిపెట్టనంత కాలం, ఆ నేనుని మనం పోగొట్టుకోలేనంతకాలం, ఈ శవాలు వస్తాయి, సంసారాలు వస్తాయి, లోకాలు వస్తాయి, ఇవన్నీ తప్పవు. ఈ నేను నేను అనే భావన ఉన్నంతకాలం ఈ నేను నేను అనే తలంపు ఉన్నంతకాలం ఈ ద్వైతం అనేది తప్పనే తప్పదు.

ఇక్కడ కూర్చున్న మనుషులలో స్త్రీలలో కానీ, పురుషులలో కానీ దుఃఖం లేని మనిషి ఎవరైనా ఉన్నారా? నాకు ఏమి దుఃఖం లేదు, నేను సుఖంగా ఉన్నాను అని చెప్పటానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా? ఏవండీ కొంతమంది అంటారు ఈ లోకం అట్టిది అండి అని అంటారు. లోకం మిమ్మల్ని ఏమైనా దుఃఖ పడమంటుందా? చదువుకున్న వాళ్ళు ఉన్నారు, ధనవంతులు ఉన్నారు, వాళ్లకి కూడా దుఃఖం వస్తుంది, కారణం ఏమిటి? ఏవండీ పోనీ ఎవరైనా దుఃఖ పడుతున్నారు అనుకోండి వాళ్ళ దుఃఖాన్ని కొంచెం చేతిలో వేసి చూపించమనండి. దుఃఖం వచ్చినప్పుడు మీకు తలంపు లేకుండా దుఃఖం వస్తుందా? తలంపు వచ్చిన తరువాత దుఃఖం వస్తుందా? కొంతమంది నాకు ఈ రోగం వచ్చిందదండి, ఆ రోగం వచ్చిందదండి అని చెబుతూ ఉంటారు. భగవాన్ చెప్పారు అహంకారం పెద్ద రోగం అన్నారు. అంటే అహంకారం అనే పెద్ద రోగం ఉన్నంతకాలం ఈ శరీరాలు వస్తాయి, అంటే శవాలు వస్తాయి. దేహమే ఒక రోగం అయినప్పుడు, దేహానికి రోగం వస్తే ఆశ్చర్యం ఏముంది? అందుచేత పెద్ద రోగాన్ని తొలగించుకోనంత కాలం మీకు ఈ రోగాలు వస్తూనే ఉంటాయి. అందుచేత అహంకారాన్ని తొలగించుకోండి ఇంక మీ శరీరం తోటి పనే లేదు. శరీరం లేని వాడికి రోగం ఏమిటి? శరీరం లేనివాడికి దేవుడు ఏమిటి? శరీరం లేనివాడికి లోకం ఏమిటి? శరీరం లేనివాడికి శోకం ఏమిటి? అంటే మన భక్తి ఎలాగ ఉంది అంటే ఈ సోర్స్‌ని తెలుసుకోవాలి అని కాదు. నేను యొక్క మూలాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నమే మనకి లేదు. మన ప్రయత్నం ఏమిటి అంటే ఈ నేను ఇక్కడ ఉండాలి. దేవుడు వేరుపాటుగా

**సబ్జెక్టు సరిగా అర్థం అయితే నూటికి 80 మార్కులు సంపాదించినట్లే. మీరు చేసే సాధనలు అన్నీ మిగిలిన 20 మార్కులు సాధించటానికే. అందువలన సబ్జెక్టును అర్థం చేసుకోవడంలోనే చాలా దూరం వెళ్ళిపోతారు. సబ్జెక్టు ప్రోపర్‌గా అర్థం అయితే ఇప్పడే ఇక్కడే దుఃఖం నశిస్తుంది.**



ఒకడు ఉండాలి, లోకం ఉండాలి. పూజలు చేసి, జపాలు చేసి ఆ దేవుణ్ణి ఏదో ఒకటి అడుగుతూ ఉండాలి. మనం అడిగినవి ఆ దేవుడు ఇస్తూ ఉండాలి. మనకి మరణం రాకూడదు. లోకం ఎప్పుడూ ఇలాగే ఉండాలి, మనం ఇక్కడే ఉండాలి, ఆ దేవుడు ఇచ్చిన భోగాలు అన్నీ మనం అనుభవించాలి. ఇది మన భక్తి యొక్క లక్ష్యం. మన ఇంద్రియాలను సంతృప్తి పరచటం కోసం, భోగాలు అనుభవించటం కోసం మన భక్తి కానీ మోక్షం కోసం కాదు, శాంతి కోసం కాదు. ఇది నిజమా? అబద్ధమా?

మీరు perfect గా సుఖంగా ఉన్నారు అనుకోండి, చాలా సుఖంగా మీరు ఉన్నారు అనుకోండి, మీకు దేవుడు ఎందుకు? మీకు ఎవరికీ కష్టం కానీ, దుఃఖం కానీ లేదు అనుకోండి, మీకు దేవుడి తోటి పని ఏముంది? మీరు శాంతిగా సుఖంగా ఉన్నారు అనుకోండి, సుప్రీమ్ peace, సుప్రీమ్ happiness లో మీరు ఉన్నారు అనుకోండి అప్పుడు మీకు దేవుడి తోటి పని ఏముంది? ఒకసారి రమణస్వామిని ఏమని అడిగారు అంటే బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు మీకు కనిపిస్తారు అనుకోండి, కనిపిస్తే వారిని మీరు ఏమైనా కోరికలు కోరుకుంటారా అని అడిగారు. మన భక్తి అంతే కదా, బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు కనిపిస్తే మీరు ఏమైనా కోరికలు కోరుకుంటారా అని రమణస్వామిని అడిగారు. నేను కోరుకుంటాను అన్నారు. ఏమని కోరుకుంటారు మీరు? అని అడిగారు. అంటే మీరు ఎప్పుడూ నాకు కనిపించవద్దు అని కోరుకుంటాను అన్నారు. విష్ణుదేవుడు, శివదేవుడు కనిపిస్తే కోరుకుంటారు అట రమణస్వామి, ఏమని కోరుకుంటారు అట మీరు ఎప్పుడు నాకు కనిపించవద్దు అని, అంటే పరిపూర్ణమైన శాంతి మీకు అనుభవం అయితే ఆ పరిపూర్ణమైనటువంటి సుఖం మీకు అనుభవం అయితే దేవుడు నిజంగా వచ్చి అక్కడ కనిపిస్తే మీకు ఇలా మొఖం పైకెత్తి చూడాలి అనిపించదు, అట్టిది ఆ శాంతి. ఆ పరిపూర్ణమైన శాంతి, ఆ పరిపూర్ణమైన సుఖం, ఆ నిర్మలమైన సుఖం మీ బుద్ధికి అందినప్పుడు, నిజంగా దేవుడురూపం ధరించి అక్కడికి వచ్చినప్పటికీ మీకు కళ్ళు ఎత్తి చూడాలి అనిపించదు. అటువంటి సుఖం, అటువంటి శాంతి మీ హృదయంలోనే ఉంది. కొంతమంది ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోతే ఊరు విడిచి పెట్టి వెళ్ళిపోతే ఎక్కడికో వెళ్ళిపోతే శాంతి వస్తుంది అనుకుంటారు. భగవాన్ అన్నారు నీ ఇల్లు విడిచిపెట్టి పారిపోతే ఊరు మారుతుంది, దేశం మారుతుంది, వాతావరణం మారుతుంది, పరిసరాలు మారతాయి, పరిస్థితులు మారతాయి, నీ అహంకారం

నీ కూడానే వస్తుంది. కొంతమంది కాశీ వెళ్ళిపోదాం, రామేశ్వరం వెళ్ళిపోదాం అంటారు, కాశీ వెళ్ళిపోతే పోనీ శృంగవృక్షం కనపడదు. నువ్వు ఎక్కడకి వెళ్ళు నీ అహంకారం నీ కూడానే వస్తుంది. మనిషి కూడా నీడ ఎలా పరుగెత్తుకుని వస్తుందో నీ అహంకారం నువ్వు ఎక్కడికి వెళ్ళినా వస్తుంది. ఇంటిదగ్గర టైముకి భోజనం చేసి, టైముకి కాఫీ తాగి నువ్వు అహంకారం జయించలేకపోతే అడవులకు వెళ్ళి ఎక్కడో దూరాన గంగానది ఒడ్డున నువ్వు అహంకారాన్ని జయించగలవా? ఇక్కడ ఉన్నా అహంకారాన్ని జయించాలి, అడవిలోకి వెళ్ళినా అహంకారాన్ని జయించాలి. నువ్వు ఇంటిదగ్గర ఉండి చేయలేని పని అడవిలోకి వెళ్ళి, అరణ్యానికి వెళ్ళిచేయగలవా? నీకు అన్ని సదుపాయాలు ఉండగానే ఇంటిదగ్గర నువ్వు ఆ పని చేయలేకపోతే అహంవృత్తిని జయించలేకపోతే అరణ్యానికి వెళ్ళిచేయగలవా?

ఇప్పుడు మీరందరూ ఎక్కడ ఉన్నారు? మోక్షంలోనే ఉన్నారు. మీ పేరు ఎల్లమ్మ కాదు, పుల్లమ్మ కాదు. మీ పేరే మోక్షం. పోనీ మోక్షంలో లేరు అనుకోండి, ఎక్కడ ఉన్నారు మీరు ఇప్పుడు? మనకు మరణం వచ్చినప్పుడు కూడా ఈ అహంకారం ఏదోఒక రూపాన్ని స్మరిస్తూ మరణిస్తుంది. రూపాన్ని పట్టుకుని పుడుతుంది. రూపాన్ని పట్టుకుని నిలుస్తుంది. రూపాన్ని విడిచి రూపము దాల్చును, వెదకగా వదిలి పరిగెత్తును, ఆ రూపము లేని అహంకార పిశాచి. అందుచేత రాముడినో, కృష్ణుడినో, ఈశ్వరుడినో, ఎందుకు పూజించమన్నారు అంటే లోకానికి సంబంధించిన రూపాన్ని పట్టుకుని ఉంటుంది అహంకారం. అందుచేత ఏదోఒక దేవతా రూపాన్ని ఆరాధించగా, ఆరాధించగా, మన మనస్సులో అంటిపెట్టుకున్న మిగతా రూపాలు అన్ని రాలిపోతాయి. మీరు ఒక రాముడినో కృష్ణుడినో ఆరాధిస్తున్నారు అనుకోండి ఆరాధించగా, ఆరాధించగా, మీ మనస్సు ఆ రూపాన్నే గనుక పట్టుకుని ఉంటే ఏ కారణాలు అయితే బంధిస్తున్నాయో, ఏ విషయాలు అయితే మిమ్మల్నిబంధిస్తున్నాయో అన్నీ రాలిపోతాయి.

భగవంతుడు గీతలో ఏమి చెప్పాడు అంటే మరణించే టైములో ప్రాణ ప్రయాణ టైములో నన్ను స్మరిస్తే అతనికి నా స్వరూపం ఇస్తాను అన్నాడు. స్వరూపం అంటే ఏమిటి, ఆత్మే, సత్యమే! చాడ్విక్ గారు అని ఒకాయన చదివాడు భగవద్గీతలో ఈ మాట. ఈ చాడ్విక్ గారు ఇంగ్లండులో మేజర్ జనరల్ చేశాడు ఆర్మీలో. ఆ దొరగారు చదివారు భగవద్గీతలో ఈ మాట. ప్రాణం పోయే టైములో ఎవరైతే నన్ను స్మరిస్తున్నారో, వాళ్ళకి నా స్వరూపాన్ని ఇస్తాను అని భగవద్గీతలో భగవంతుడు చెప్పిన మాట, ఆ శ్లోకాన్ని ఎక్కువ స్మరించుకునేవారు ఈ దొరగారు. ఈయన

రమణస్వామి భక్తుడు. ఒకరోజు ఈయన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తూ అరుణాచల శివున్ని ధ్యానం చేస్తున్నాడు. ఎదురుగుండా లారీ వస్తోంది. ఏమనుకున్నాడు అంటే ఈ దొరగారు? ఇప్పుడు నా మనస్సు ఎవరిని స్మరిస్తోంది? అరుణాచల శివున్ని స్మరిస్తోంది. దేవుణ్ణి స్మరిస్తోంది. అవసాన దశలో, మరణ సమయంలో, దేవుణ్ణి స్మరిస్తే దేవుడి స్వరూపాన్ని పొందుతావు అని భగవంతుడు గీతలో చెప్పాడు. భగవంతుడు అబద్ధం చెప్పడు కదా అందుచేత ఇక్కడ లారీ వస్తోంది. ఆ లారీ కింద నేను పడిపోతాను. ఆ లారీ కింద పడిపోతే నా ప్రాణం పోతుంది. ఇప్పుడు నేను భగవంతున్ని స్మరిస్తున్నాను కాబట్టి నాకు మోక్షం వచ్చేస్తుంది అని ఒక నిర్ధారణకి వచ్చాడు. లారీ వస్తోంది. లారీ కింద పడదాం అనుకుంటున్నాడు ఈలోగా ఆ లారీ వచ్చి తప్పించుకుని వెళ్ళిపోయింది. రమణమహర్షి గారి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. వీడికి వచ్చిన ఆలోచనలు అన్నీ తెలుసు ఆయనకి. ఆయనకి ఏమీ తెలియనట్టు ఊరికే ఆ గోడ వంక అలా చూస్తున్నారు. నేను ఫలానా విధంగా అనుకున్నాను. నా మనస్సులో అనుకున్నది మీకు తెలియలేదా? అని ఎవరైనా భగవాన్‌ని అడిగితే నాకేమి తెలియలేదు. మీ మనస్సులో ఏమి అనుకున్నారో తెలుసుకునే శక్తి నాకు భగవంతుడు ఇవ్వలేదు అనేవారు. ఆయన ఋషి అంటే, నటించేవాడు ఋషి కాదు. చాడ్విక్‌గారు వచ్చి కూర్చున్నారు. ఏమండీ లారీ వచ్చింది, దానికిందపడిపోదాం అనుకున్నాను నాకు మోక్షం వచ్చేస్తుంది అని, అనుకుంటున్నాను ఈలోగా లారీ వచ్చి దాటేసి వెళ్ళిపోయింది అని భగవాన్‌తో చెప్పాడు. అప్పుడు భగవాన్ ఒకమాట అన్నారు. లారీ వచ్చినప్పుడు నువ్వు అరుణాచలేశ్వరున్ని స్మరించుకుంటున్న మాట నిజమే, కానీ గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు? ప్రాణం పోయే టైములో నన్ను స్మరిస్తే నేను మోక్షం ఇస్తాను అని చెప్పాడు. అది కరెక్టే. భగవద్గీతలో వాసుదేవస్వామి చెప్పిన statement కరెక్టే. నువ్వు ఏమనుకుంటున్నావు లారీ కింద పడదాం అనుకున్నప్పుడు నువ్వు భగవంతున్ని స్మరిస్తున్నావు అది కరెక్టే. కానీ లారీ కింద నువ్వు పడి ఆ లారీ టైరు వచ్చి నీ పీకి మీద నుంచి వెళ్ళిపోయినప్పుడు సరిగ్గా ప్రాణం పోయే టైములో నువ్వు భగవంతున్ని స్మరించలేవు. నీకు మోక్షం రాదు అని చెప్పాడు. అదేమిటండి స్వామీ అన్నాడు. అంటే ఏమి చెప్పారు అంటే దాని అర్థం ప్రాణం పోయేటప్పుడు ఈ చిలక పలుకులు రావు. చిలకకి నేర్పుతారు రామా, రామా అని. ఆ చిలకని పిల్లి వచ్చి పట్టుకుంది అనుకోండి రామా, రామా అంటుందా అది? అలా మన భక్తి నేర్చుకున్న భక్తి. మన భక్తి హృదయంలో నుంచి వచ్చింది కాదు నేర్చుకున్నది. అంటే

ప్రాణం పోయే టైములో వచ్చే ఆ భక్తి మనకి ఇంకా రాలేదు. ఆ స్థితి మనకి ఇంకా రాలేదు. లారీ కింద పడదాం అనుకున్నప్పుడు నువ్వు భగవంతుని స్మరిస్తున్నావు అది కరెక్టే. ఆ లారీ వచ్చి నీ పీక మీద నుంచి వెళ్ళిపోయినప్పుడు నువ్వు అరుణాచలేశ్వరున్ని స్మరించవు, కృష్ణున్ని స్మరించవు, రామున్ని స్మరించవు. దైవాన్ని అసలు స్మరించనే స్మరించవు. అప్పుడు ఏది స్మరిస్తావో చెప్పమంటావా? ఏదైతే నీ హృదయంలో బరువుగా ఉందో, ఏ వాంఛ అయితే, ఏ కోరిక అయితే, ఏ ఆదర్శం అయితే, ఏ ఆశయం అయితే, ఏ ఆకాంక్ష అయితే నీ హృదయంలో బరువుగా ఉందో, నీ హృదయంలో ఏది ముఖ్యంగా నువ్వు ఉపాసిస్తున్నావో, నీ హృదయంలో ఉన్న బలీయమైన కోరికే నీ ప్రాణం పోయే టైములో నీ మెదడులోకి వస్తుంది కానీ దేవుడు రాడు అని చెప్పారు. ఇంకొకటి జ్ఞాపకం ఉంచుకోండి. ప్రాణం పోయే టైము మనకి వస్తుంది అనుకోండి ఆ ప్రాణం సరిగ్గా ఏ సెకనులో పోతుందో మనకి తెలియదు. అందుచేత ప్రాణం పోయే టైములో నువ్వు ఈశ్వరుణ్ణి స్మరించలేవు. నీ హృదయంలో ఉండే కోరికే నీకు బయటకి వస్తుంది. ఆ కోరికనే స్మరిస్తావు, కాని ఈశ్వరుణ్ణి మటుకు స్మరించవు. అందుచేత అటువంటి పనులు చేయకు అన్నారు.

అహంకారం ఉంటే ప్రపంచం ఉంది. అహంకారం ఉంటే దేవుడు ఉన్నాడు. అహంకారం ఉంటే లోకం ఉంది. అహంకారం ఉంటే జీవుడు ఉన్నాడు. అహంకారం ఉంటే సంసారం ఉంది, అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం లేకపోతే ఏది లేదు. అది ఉంటే అంతా ఉంది. గౌరవం ఉంది, అగౌరవం ఉంది, కీర్తి ఉంది, అపకీర్తి ఉంది, రాగం ఉంది, ద్వేషం ఉంది, ఇవన్నీ ఉన్నాయి. లోకం ఉంది, భయం ఉంది, అహంకారం ఉంటే ఇవన్నీ ఉన్నాయి. అహంకారం లేకపోతే ఇవన్నీ ఏమి లేవు. ఈ లోభం ఉన్నా, ఈ రాగం ఉన్నా, ఈ ద్వేషం ఉన్నా ఇవన్నీ అహంకారానికి సైన్యం. అహంకారానికి ఆర్మీ లాంటివి. వీటి అన్నిటికి అహంకారం కమాండర్ చీఫ్. అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం లేకపోతే ఏది లేదు. కనుక



**బయట గురువు నీ మనస్సును లోపలకు పంపే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు లోపల గురువు నీ మనసును లోపలకు లాగేసుకుని నీ జీవ లక్షణాలను కరిగించి తన స్వరూపాన్ని వ్యక్తపరుస్తాడు. అప్పుడు మీరు జన్మలు లేని స్థితికి ఎదిగిపోతారు. ఇక శవాలను మోయనక్కరలేదు.**

అహంకారమే అఖిలమగును, కావున అది యేదని వెదకుటయె అఖిలము వదలుట అని యెరుగుము. నువ్వు నీ భర్తను వదిలేస్తే నీకు జ్ఞానం రాదు. మీ ఇల్లును వదిలేస్తే మీకు జ్ఞానం రాదు, మీకున్న వస్తువులను వదిలేస్తే మీకు జ్ఞానం రాదు, మీరు చేసుకునే పని పాటలు వదిలేస్తే మీకు జ్ఞానం రాదు, ఒకవేళ మీరు ఆత్మహత్య చేసుకుంటే, మీ దేహాన్ని విడిచి పెట్టేస్తే మీకు జ్ఞానం రాదు, అహంకారాన్ని విడిచి పెడితే జ్ఞానం వస్తుంది అంటున్నారు. మీకున్న బాహ్యమైన వస్తువులను విడిచిపెట్టేస్తే జ్ఞానం రాదు. ఇల్లు విడిచి పెట్టేస్తే జ్ఞానం రాదు, ఎవడైతే అహంకారాన్ని విడిచి పెడుతున్నాడో, దేహానికి పరిమితం అయిన నేనుని ఎవడైతే విడిచి పెడుతున్నాడో, దానిని ఎవడైతే త్యాగం చేస్తున్నాడో వాడికి మటుకే జ్ఞానం కలుగుతుంది. నీకు వేరుగా ఉన్న వస్తువును విడిచి పెట్టినంత మాత్రాన నీకు జ్ఞానం వచ్చేయదు. అందుచేత మీరు రోజు ఇంటిదగ్గర చేసుకునే పనుల్లో కూడా మీ అహంకార విజృంభణ తగ్గే విధానం మీరు చూసుకోవాలి. మీకు వచ్చే ఆలోచనల్లోనూ, మీరు చేసుకునే పనుల్లోనూ, మీరు చేసుకునే కార్యక్రమాల్లో మీ అహంకారం పలుచబడుతూ ఉండాలి. అహంకారం పలుచబడేల మీరు చూసుకుంటే ఈశ్వర అనుగ్రహం మీకు వస్తుంది. మీరు ఏదైనా దానాలు చేశారు అనుకోండి దానివల్ల అహంకారం పెరగకూడదు, అహంకారం తగ్గాలి. మీరు ఏదైనా మంచి పని చేశారు అనుకోండి దానివల్ల అహంకారం పెరగకూడదు, అహంకారం తగ్గాలి. మీరు పూజ చేశారు అనుకోండి పూజవలన అహంకారం తగ్గాలి, అహంకారం పెరిగితే పూజ యొక్క ప్రయోజనం లేదు. అలాగే ధ్యానం చేస్తున్నారు అనుకోండి, అహంకారం తగ్గాలి. మీ ధ్యానం పేరు మీద అహంకారం పెరిగితే దానివల్ల ప్రయోజనం ఏమీ లేదు.

జీవితం పొడవునా వ్యవసాయం చేసేవాడు మరణించే టైములో వ్యవసాయం గొడవలే స్మరిస్తూ ఉంటాడు. జీవితం పొడవునా వ్యాపారం చేసేవాడు మరణించే టైములో ఆ వ్యాపారం గొడవలే బుర్రలోకి వస్తాయి. జీవితం పొడవునా ఎవడు ఏ పని చేస్తే మరణించే టైములో అవే వస్తాయి. అలాగే రాముడినో, కృష్ణుడినో స్మరించుకుంటూ ఉంటారు అనుకోండి జీవితం పొడవునా వాడికి రాముడో, కృష్ణుడో ఆ తలంపు వస్తుంది రైటే. అయితే స్మరణ చేసేవారు ఎవరు? మంచి విషయాలను స్మరించిన వాడికి మంచి జన్మలు వస్తాయి. చెడ్డ విషయాలను స్మరించిన వాడికి చెడ్డ జన్మలు వస్తాయి. అసలు స్మరణ చేసేవాడు ఎవడు? ఆలోచించేవాడు ఎవడు? వాడిని ఎప్పుడైనా చూశారా? ఏవండీ నేను అది చూశాను, ఇది చూశాను

అంటున్నారు. కానీ చూసేవాడిని ఎప్పుడైనా చూశారా? మీలో ఉండి ఎవడో చూస్తున్నాడు కదా ఈ లోకాన్ని, ఆ చూసేవాడిని మీరు ఎప్పుడైనా చూశారా? భగవాన్ దగ్గరకి వచ్చి ఒకరు ఇలా చెప్పారు మేము జపం చేస్తున్నాము అయితే మా గురువుగారు ఏమని చెప్పారు అంటే జపం చేయమన్నారు. ఆ జపం వల్ల ఫలితం వస్తుంది. ఆ ఫలితం మా గురువు గారు ఇచ్చేయమన్నారు. జపం మటుకు నన్ను చేయమన్నారు అని భగవాన్‌తో చెప్పారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏమయ్యా ఈ గురువు కంటే మీ గురువే మంచివాడు అన్నారు. ఎందుచేత అంటే మీ గురువు ఎందుకు మంచివాడు అంటే జపం నిన్ను చేసుకోమన్నాడు. ఫలితం ఆయన తీసుకుంటాను అంటున్నాడు. అంటే అసలు నీ దగ్గరే ఉంది వడ్డీ మటుకు ఆయన తింటున్నాడు. కానీ ఈ గురువు ఏమి చేస్తాడు అంటే అసలూ మింగేస్తాడు, వడ్డీ మింగేస్తాడు. అందుచేత ఈ గురువు మీద మీ గురువే మంచివాడు. జపం చేసేవాడిని ఉంచుతున్నాడు మీ గురువు మంచివాడు కాబట్టి, ఈ గురువు అయితే జపం చేసేవాడిని తినేస్తాడు. అంటే జపం చేసే జపిని తినేస్తాడు. ఆ జపం వల్ల వచ్చే ఫలితాన్ని తినేస్తాడు. ఈ గురువు మీద మీ గురువే మంచివాడు అని చెప్పారు.


భగవాన్ దగ్గరకు ఆయన స్నేహితుడు ఒకతను వచ్చాడు. నీ పేరు నేను విన్నాను. నీ ఫొటోలు చాలా షాపులలో చూశాను. మనిద్దరం చిన్నప్పుడు చదువుకున్నాం. ఈతలుకొట్టేవాళ్ళం, నేనేదో నా దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఉద్యోగం చేస్తున్నాను. నువ్వు చాలా పైకి వచ్చావు. అని తన చిన్ననాటి స్నేహితుడు ఒకడు రమణస్వామి తోటి చెప్పాడు. రమణస్వామి ఏమి అన్నాడు అంటే ఏమయ్యా నేను పైకి రాలేదు, లోపలికివెళ్ళాను అన్నాడు. నేను పైకి వచ్చాను అనుకుంటున్నావు. అంటే మనకి ఎంతసేపు పైకి వెళదాం అనే గొడవే అయితే భగవంతుడు నీ హృదయంలో ఉన్నానని చెబుతున్నాడా? పైన ఉన్నానని చెబుతున్నాడా? అదే భగవాన్ చెప్పారు. నేను పైకి రాలేదు లోపలికి వెళ్ళాను. ఇంకొకసారి భగవాన్ తోటి అన్నారు ఏవండీ ఎప్పుడు చూసినా మీరు మాతోటి మాట్లాడుతున్నారు. మీరు ఎంతసేపు మాతోటే కూర్చుంటున్నారు. మాతోటే వంట పనులు చేస్తున్నారు, మాతోటే వడ్డన చేస్తున్నారు, మీరు మాలో ఒకరిగా తిరుగుతున్నారు. మీరేమి ధ్యానం చేసుకోవటం లేదు, జపం చేసుకోవటం లేదు అని అడిగితే అప్పుడు భగవాన్ అన్నారట బయట ఉన్నవాడు లోపలికి వెళతాడు. నేను ఇప్పుడు బయట ఉన్నానా నన్ను లోపలికి వెళ్ళమంటున్నారు?

ఆయన్ని ధ్యానం చేసుకోమని ఈయన ఉద్దేశం. ఆయన ధ్యానం ఎవరితోటి చేస్తాడు. మనసుతో చేయాలి, మనసు ఎక్కడ ఉంది? ఉన్నది ఒక్కటే వస్తువు, ఆత్మ. అది ఎక్కడ ఉంది? దేనితోటి చేయగలరు ఆయన, మనస్సే లేనప్పుడు లోపల ఏమిటి? బయట ఏమిటి? ఈ శరీరం లోపల నేను ఉన్నాను. నా బయట ప్రపంచం ఉంది. బయట ఎక్కడో దూరాన దేవుడు ఉన్నాడు. ఈ కల్పించేది అంతా అహంకారమే. ఇదంతా మనసు యొక్క చేష్టలు. అందుచేత మీరు అందరూ ఏమి అంటున్నారు? ఈ స్వామి పాడైపోయారు. కాసేపు జపం చేసుకోడు ఏమిటి? కాసేపు ధ్యానం చేసుకోడు ఏమిటి అని మీరు అనుకుంటున్నారు. నన్ను లోపలికి వెళ్ళిపోమంటున్నారు. నేను బయట ఉంటే లోపలికి వెళ్ళవచ్చు. బయటే లేనప్పుడు లోపలికి ఎక్కడికి వెళతాను?

వేదాంత ఉపన్యాసాలలో ఏమని చెపుతారు అంటే మనసుని నిగ్రహించుకోవాలి, మనసుని నిగ్రహించుకోవాలి అని చెబుతారు. మనస్సుని నిగ్రహించుకోవాలి రైటే దానిని ఎప్పుడైనా చూశారా అసలు మనసు ఎలా ఉంటుందో, తలంపే మనసు. మనసు అంటే ఏమిటి మనకు వచ్చే తలంపే మనసు. ఈ తలంపు ఎక్కడ నుంచి వస్తోంది? ఈ నేను అనే తలంపు ముందు వచ్చాక నాకు ఇతర తలంపులు వస్తున్నాయా? నేను అనే తలంపు లేకుండానే తలంపులు వస్తున్నాయా? నాకు తలంపు వస్తుంది. అది మంచి తలంపో, చెడు తలంపో వేరే విషయం. తలంపు వస్తుంది. ఎవరికి వస్తుంది తలంపు? నాకు వస్తుంది. నాకు వస్తుంది అంటే నేను ఎవడను అనే ప్రశ్న వేయండి. ఈ తలంపు ఏమి చేస్తుంది అప్పుడు నెమ్మదిగా పుట్టింటికి వెళ్ళిపోతుంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ హృదయం పుట్టిల్లు అన్నారు, ఈ బుర్రేమో అత్తారిల్లు అన్నారు. ఏవండీ ఇపుడు మనకి అనేక తలంపులు ఉన్నాయి. అనేక వాసనలు ఉన్నాయి. కాని అన్ని తలంపులు ఇక్కడ కనపడవు. ఏదోఒక తలంపు వస్తుంది. అది వెళ్ళిపోతుంది, మళ్ళీ ఇంకొక తలంపు వస్తుంది, అది వెళ్ళిపోతుంది. రెండు తలంపులు ఒక్కసారి ఎవరికైనా వచ్చాయేమో చెప్పండి మీరు? మీరు ఒకేసారి పుట్టింటికాడ, అత్తారింటి కాడ ఉంటున్నారా అండి, ఉంటే పుట్టింటికాడ ఉంటున్నారు లేకపోతే అత్తారింటి కాడ ఉంటున్నారు. ఒకేసారి పుట్టింటి కాడ అత్తారింటి కాడ ఉంటున్నారా? ఈ తలంపు ఏమి చేస్తుంది? ఉంటే పుట్టింటి కాడ ఉంటుంది లేకపోతే అత్తారింటి కాడ ఉంటుంది. ఈ శిరస్సు అత్తారిల్లు. బొమ్మ వచ్చి తెర మీద పడ్డట్టు ఒక్కొక్క

తలంపు వచ్చి శిరస్సు మీదకి వస్తుంది. ఏదైతే శిరస్సులోకి వచ్చిందో ఆ తలంపునే మనము పట్టుకుంటాము. మిగతా తలంపులు ఏమీ లేవా మనకి? ఆ ఒక్క తలంపే ఉందా? ఏవండీ మీ మీద నాకు కోపం వచ్చింది. అది ఒక తలంపు. మిగతా తలంపులు నాకు ఏమీ లేవా? ఇంకా తొంభై తలంపులు ఉన్నాయి. అవి అప్పుడు ఎక్కడ ఉన్నాయి. మీ ఇంట్లో ఇనుప పెట్లో ఉన్నాయా లేకపోతే భోషాణంలో ఉన్నాయా? నాకు మీ మీద కోపంగా ఉంది. ఇది ఒక తలంపు. ఇది ఒకటేనా తలంపు నాకు చాలా ఉన్నాయి. ఆ తలంపులు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి? హృదయంలో ఉన్నాయి. ఏవండీ, ఈ తలంపు వెళ్ళిపోయిన తరువాత ఇంకొక తలంపు వస్తుంది ఇక్కడ నుంచి, ఆ తలంపు ఖర్చు పెట్టేసుకున్నాక ఇంకొక తలంపు వస్తుంది. వచ్చిన తలంపుని మన ఇంద్రియాల ద్వారా సంతృప్తి పరుస్తాము అనుకోండి ఆ తలంపుని, ఆ తలంపుకి ఇంకా food పెరుగుతుంది. అది ఇంకా బలుస్తుంది. ఇంకా బలిసి హృదయంలో ప్రవేశిస్తుంది. ఏవండీ, ఇంకొక సెకనుకి ఏమి తలంపు వస్తుందో మీకు తెలుసా? మనం అందరం చాలా తెలివైన వాళ్ళం, మేధావులం అనుకుంటున్నాం. ఇంకొక సెకనులో ఏమి తలంపు వస్తుందో చెప్పండి మీలో ఎవరైనా, మీరు అందరూ భక్తులే కదా, చెప్పండి. ఇంకొక సెకనుకి ఏ తలంపు వస్తుందో చెప్పండి. ఇవన్నీ మన హృదయంలోనే ఉన్నాయి. ఏ సెకనులో ఏ తలంపు వస్తుందో మనకి తెలియదు.

మనం చేసిన పుణ్యాలు, మనం చేసిన పాపాలు, మనకున్న రాగాలు, మనకున్న ద్వేషాలు, ఇవన్నీ హృదయంలో స్టోర్ అయ్యి ఉంటాయి. ఏవండీ వాసనగ మీ హృదయంలో



**నీ హృదయంలో ఒక సత్య వస్తువు ఉంది దానితో సహవాసం చేయడం నేర్చుకో, అది సత్సంగము. అది చెయ్యలేకపోతే బయట ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సద్గ్రంథాలు మనం బాగుపడటానికి దారి చూపిస్తాయి కానీ జ్ఞానుల సమక్షంలో మనం ఉన్నప్పుడు ప్రగాఢమైన శాంతి మీ మాటలకు అందని శాంతి, మీ ఊహలకు అందని శాంతి ప్రవాహములాగా వచ్చి మిమ్ములను ముంచుతుంది. బాహ్యంగా మీకు ఉన్న పరిస్థితులతో సంబంధం లేకుండా జ్ఞాని హృదయం నుండి వచ్చే కాంతి తరంగాలు, శాంతి తరంగాలు మిమ్ములను శాంతిలో ముంచుతాయి.**

స్టోర్ అయ్యి ఉండి మనకి మరణించే టైములో, ఒక్కసారి హృదయంలో ఉన్న తలంపులు అన్నీ విజృంభిస్తాయి. ఏదోఒక రోజున మనకి ప్రాణం పోతుంది. ఆ ప్రాణం పోయినప్పుడు ఈ హృదయంలో తలంపులు ఏమి చేస్తాయి? అన్నీ ఒక్కసారి విజృంభిస్తాయి. మనకి అనేక గొడవలు ఉంటాయి. ఒక గొడవ కాదు. సామాజిక సమస్యలు, ఆర్థిక సమస్యలు, లోక సమస్యలు, మళ్లీ వీటి అన్నిటితో పాటు ఊరగాయ నంచుకున్నట్టు భక్తి ఒకటి. మనకు మెయిన్ సెంటర్ లో ఉన్నది అన్నమే. సెంటర్ లో ఉన్నది లోకమే దేవుడు కాదు. అయితే దేవుడు ఎందుకు అంటే మనకి పచ్చడి లాంటివాడు అన్నమాట, మెతుకులు మింగడానికి కొంచెం పచ్చడి ఎలా నంచుకుంటామో ఈ లోకం కోసం దేవుడిని పెట్టుకున్నాం మనం, దేవుడిని తయారు చేసుకున్నాం, మన అహంకారాన్ని దేవుడికి అప్పచెప్పటం మనకి ఇష్టం లేదు. ఈ అహంకారంతో వాడిని మింగుదాం అని, ఏ దేవుడిని అయితే మనం ప్రార్థిస్తున్నామో వాడిని మింగటానికి మనం చూస్తున్నాం, అది మన భక్తి.

అహంకారం కలదనిన అఖిలము కలదు, అది లేదనిన అఖిలమును లేదు, కనుక అహంకారమే ప్రపంచం. అది వెదకుటయే సకలమును వదలుట. అహంకారాన్ని వెతకండి, అహంకారాన్ని అన్వేషించండి. దాని మూలాన్ని తెలుసుకోండి. తెలుసుకుంటే అది పడిపోతుంది. అహంకారం ఎవరిని విడిచి పెడుతుంది? అహంకారం యొక్క మూలం ఎవరికి అయితే తెలిసిందో వాడిని మటుకే అహంకారం విడిచి పెట్టి వెళ్లిపోతుంది. మన జీవితంలో మనం చేసిన పనులు అన్నీ మరణ కాలంలో విజృంభిస్తాయి. అలా విజృంభించేటప్పుడు కొన్ని మనకు చాలా ఇష్టమైన వాంఛలు ఉంటాయి. కొన్ని ఇష్టం లేని వాంఛలు ఉంటాయి. ఏదైతే గాఢంగా, గూఢంగా, లోతుగా ఏ వాసన అయితే, ఏ సంస్కారం అయితే మన హృదయంలో ఉండిపోయిందో అది బలీయంగా ఉబికినట్టు వస్తుంది ప్రాణం పోయేటప్పుడు. ఏదైతే మనకి చాలా ప్రియమైనదో ఏదైతే నియరెస్టో, ఏదైతే డియరెస్టో మనకి సరిగ్గా ఆ వాసనని పట్టుకుంటుంది ఈ అహంకారం. ఆ వాసనని పట్టుకుని మొత్తం ఈ సంస్కారాలు అన్నిటిని పోగు చేసుకున్న తరువాత అప్పుడు ప్రాణం విడిచి పెడుతుంది. అప్పటివరకు ఎంత కంగారు పడ్డా ప్రాణం పోదు మనకి, అంటే రాబోయే జన్మ మనకి ప్రాణం ప్రయాణ టైములో నిర్ణయం అయిపోతుంది. మనం ఒక అడుగు ముందుకు వేసిన తరువాత వెనకాల కాలు ఎత్తుతాము. ఏవండీ రెండు కాళ్ళు ఒకసారి ఎత్తుతాం అనుకోండి బోర్లా పడతాము. ఈ అహంకారం ఏమి

చేస్తుంది? రాబోయే జన్మను కూడా నిర్ణయం చేసేసుకుని రాబోయే రూపాన్ని పట్టుకున్నాక ఈ రూపాన్ని విడిచి పెడుతుంది. అంత వరకు ఈ రూపాన్ని విడిచి పెట్టదు. అదే పునర్జన్మ. పునర్జన్మ అంటే ఏమిటి? అహంకారం అలాగే ఉంటుంది. అహంకారం మరణించదు. శరీరానికే మరణం. శరీరానికే నాశనం, అహంకారానికి నాశనం లేదు. ఆత్మ దర్శనం అయ్యే వరకు అహంకారానికి నాశనం లేదు. నిజాన్ని చూసే వరకు దానికి నాశనం లేదు. అహంకారం ఈ శరీరాన్ని విడిచి పెట్టేముందు ఇంకొక శరీరాన్ని పట్టుకుని ఇంకొక శరీరం యొక్క ఆధారాన్ని తీసుకుని అప్పుడు ఈ శరీరాన్ని విడిచి పెడుతుంది, ఆ శరీరంలో ప్రవేశిస్తుంది. సత్యాన్ని దర్శించిన వాడికే అది లొంగుతుంది.

భగవాన్ ఏమి చెప్పారు అంటటే ఏదైతే నిజమో మనం అది ఒకటే మర్చిపోతాం, మిగతావి అన్ని మనకు జ్ఞాపకం ఉంటాయి, ఒక పెద్ద మనిషి వచ్చి భగవాన్‌తో ఇలా చెప్పారు మీరు బ్రాహ్మణులే, మేము బ్రాహ్మణులమే, భగవాన్ అన్నారట సరి సరి, మీ నక్షత్రం పునర్వసు నక్షత్రం, నా నక్షత్రం పునర్వసు నక్షత్రమే. భగవాన్ అన్నారట సరి సరి, ఏవండీ గోత్రం మీ గోత్రం, మా గోత్రం ఒక్కటే. భగవాన్ అన్నారట సరి సరి. మీ వయసు నా వయసు ఒక్కటే. అంటే వయసు కూడా ఇద్దరికీ ఒక్కటే. అప్పుడు భగవాన్ సరిసరి అన్నారు. ఆఖరున భగవాన్ అన్నారు అన్నీ చెప్పేసారా? ఇంకా ఏమైనా మిగిలినవా అని, స్వామి అన్నీ చెప్పేశాను, గోత్రం చెప్పేశాను, నక్షత్రం చెప్పేశాను, అన్నీ చెప్పేశాను అన్నారు. అన్నీ చెప్పేశారు కానీ ఒకటి మరచి పోయారు. మీలోను నాలోనూ ఒక్కటే ఆత్మ ఉంది. అది మరచి పోయారు అన్నారు భగవాన్. ఇదే మాయ. అందుచేత కొంతమంది జపం చేసుకునేటపుడు ధ్యానం చేసుకునేటపుడు ఏమంటారు అంటే లేని పోనీ గొడవలు అన్నీ బుర్రలోకి వచ్చేస్తున్నాయి అండి అంటారు కొంతమంది. ఏవండీ మీకూ వస్తున్నాయా అలాగ? మీకు ఎవరికి రావట్లేదేమో, అసలు గొడవలు లేవేమో మీకు. దేవుడి పటం ఎదురుగా కూర్చునేటప్పటికి వాడికి ఊర్లో గొడవలు, దేశంలో గొడవలు అన్నీ వచ్చేస్తాయి అండి, భగవాన్ అన్నారు ఏవండీ వస్తే మీకు నష్టం ఏమిటి అన్నారు. మీ లోపల ఉన్నవి బయటకి వస్తున్నాయా? లోపల లేనివి బయటికి వస్తున్నాయా అన్నారు. మీ హృదయంలో ఉన్న గొడవలు మీ బుర్రలోకి వస్తున్నాయా? లేకపోతే మీ హృదయంలో లేని గొడవలు మీబుర్రలోకి వస్తున్నాయా? రానివ్వండి, మీ హృదయంలో ఏ గొడవ ఉందో మీకే తెలియదు. ఎప్పటి వరకు తెలియదు?

మీ బుర్రలోకి వచ్చే వరకు. అందుచేత రోగం ఏమిటో మీకు తెలియకుండా మందు ఎలా వాడతారు? అందుచేత మీకు గొడవలు వస్తే రానివ్వండి. కంగారు పడకండి, అవి ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి. మీరు ఏమి చేయాలి అప్పుడు, ఎవరికి వస్తున్నాయి అని ప్రశ్న వేసుకోండి, రానివ్వండి, కంగారు పడకండి, పారిపోవద్దు. ఎస్కేపిజం వద్దు. ఇది యుద్ధం. ధ్యానం అంటే యుద్ధం. మీరు పారిపోవద్దు, ఇది ఎవరికి వస్తోంది అని ప్రశ్నించండి. ఏవండీ మీరు ప్రశ్న ఎప్పుడైతే వేసుకున్నారో అప్పుడు మనసు వెంటనే కంట్రోల్ లోకి వచ్చి ఈ తలంపు ఏమి చేస్తుంది అంటే మళ్ళీ పుట్టింటికి వెళ్ళిపోతుంది. అది మెదడులోకి ఎందుకు వస్తుంది? మేత కోసం వస్తుంది. ఒక మనిషికి మీరు లంఖణాలు కట్టేయండి. ఒక ఇరవై రోజులకో, ముప్పై రోజులకో చచ్చిపోతాడు వాడు. ఏవండీ ఈ వాసన ఏమి చేస్తుంది? కోరికను మనం ఆచరించే కొలది దాని బలం పెరుగుతుంది. ఈ కోరికను ఎప్పుడైతే మనం ఆచరణలో పెట్టమో మళ్ళీ అది హృదయంలోకి వెళ్ళిపోతుంది. మళ్ళీ మెదడులోకి వస్తుంది. ఎప్పుడైతే మనం ఆచరణలో పెట్టమో, నేను ఎవడను అనే ప్రశ్న వేసుకుని దానిని అంతర్ముఖం చేస్తున్నామో, నేను ఎవడను అనే ప్రశ్న వేసుకునేటప్పటికీ ఆ తలంపు ఏమి చేస్తుంది? మళ్ళీ హృదయంలోకి వెళ్ళిపోతుంది. అలా చేయటం వలన దానికి ఫుడ్ అందక నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది.

ఎవడైతే స్వార్థం లేకుండా పని చేస్తున్నాడో, ఎవడైతే స్వార్థం లేకుండా జీవిస్తున్నాడో, తన దైనందిన జీవితంలో స్వార్థం లేని ఆచరణ ఎవడికి అయితే ఉందో వాడికి మనో మూలం తెలుస్తుంది. వాడికి మనసు నశిస్తుంది. స్వార్థం లేనివాడికి పరమార్థం అందుతుంది. స్వార్థమే పరమార్థంగా పెట్టుకున్న వాడికి ఎవడికి మనో మూలము తెలియదు. ఏవండీ మీకు అనేక సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను అన్నిటిని కల్పించేది మనసు. ఈ మనసు అనే సమస్యను పరిష్కరించుకోవాలి అనే బుద్ధి మనకి ఎందుకు కలగటం లేదు? రమణమహర్షి ఒకమాట చెప్పారు. ఒక పెద్ద సైంటిస్టు ఉన్నాడు అనుకోండి వాడిని అడగండి నువ్వు ఎవరవో నీకు తెలుసా అని, వాడు తలవంచుకోవలసిందే. ఒక పెద్ద మేధావిని, ఒక ప్రజ్ఞావంతుడిని మీరు ఈ ప్రశ్న అడగండి, నువ్వు ఎవరవో నీకు తెలుసా అని, వాడు తలవంచుకోవాల్సిందే. మనం అన్నీ తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తాము. కానీ అన్నీ తెలుసుకుంటున్న ఈ నేను గురించి మనకి తెలియదు. మీకు ఏమనిపిస్తుంది అంటే ఏదైనా ఒక కోరిక ఉంది అనుకోండి ఈ కోరిక

నేరవేరిపోతే చాలు మనకి ఎంత సంతోషం వచ్చేస్తుందో, సుఖం వచ్చేస్తుందో అనిపిస్తుంది కాని ఈ నెరవేరిన కోరిక ఇంకో వెయ్యి కోరికలను తీసుకు వస్తుంది. Mind యొక్క secret ఇదే. నాకు కడుపు నొప్పి వస్తుంది. ఏ కారణం వల్ల నాకు కడుపు నొప్పి వస్తోంది అని ఆలోచించాలి. దానికి తగినటువంటి చికిత్స నేను చేసుకోవాలి. మీకు ఏదైనా దుఃఖం వస్తుంటే దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. దుఃఖాన్ని తొలగించమని, మంచిదే నేను కాదు అనటం లేదు. ఏ కారణం వల్ల మీకు ఆ దుఃఖం వస్తోంది. ఆ కారణం తొలిగేవరకు మీకు ఆ దుఃఖం విడిచి పెట్టదు. మీకు ఎవరికి అయినా దుఃఖం వస్తుంటే దానికి కారణం ఉండాలి. ఆ కారణం తొలగేవరకు మటుకు ఆ దుఃఖం విడిచి పెట్టదు.

మీరు కేటాయింపులు చేయకండి. కేటాయింపులు అంటే ఏమిటి? పొద్దున్న ఒక గంటసేపు పూజ చేస్తారు, తరువాత ఇరవై మూడు గంటలు ఏమిటి? మళ్ళీ లోకం గొడవ. అప్పుడు మీకేంటి మైనస్ మార్కులా - ప్లస్ మార్కులా మీకు వచ్చేవి? ఒక గంట దేవుడికి ఇచ్చి మిగతా ఇరవై మూడు గంటలు లోకానికి ఇస్తున్నారు. అప్పుడు మీకు వచ్చేది పుణ్యమా? పాపమా? అలా కాదు. మీరు పూజ చేసుకుంటే చేసుకోండి. జపం చేసుకుంటే చేసుకోండి. అది కాదు మీరు ఇరవై నాలుగు గంటలు జాగ్రత్తగా ఉండాలి. మీరు జపం చేసుకోండి, ధ్యానం చేసుకోండి దానికి ఏదో కేటాయింపు కాదు. మీరు ఇరవై నాలుగు గంటలు కూడా మీకు వచ్చే తలంపుల విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. ఎవరో భీమవరం నుంచి వచ్చారు, భీమవరం నుంచి శృంగవృక్షం వెళ్ళాలి అనే తలంపు వచ్చాక మీరు భీమవరం నుంచి శృంగవృక్షం వచ్చారా? తలంపు రాకుండానే ఇక్కడకు వచ్చి పడిపోయారా, ఏవండీ ముందు తలంపు వస్తుంది తరువాత మనం పని చేస్తాం, ఏ పని అయినా సరే తలంపు వచ్చిన తరువాత పని చేస్తాం, అందుచేత మన పని అంతా దేనిమీదఆధారపడి ఉంది? తలంపు మీద ఆధారపడి ఉంది. ఆ తలంపు విషయంలో మనం ఎందుకు జాగ్రత్త పడటంలేదు? అంటే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉంటే మనం పని విషయంలో



**మనకి ఏది మంచిదో మనకంటే గురువుకి బాగా తెలుసు. అందువలన మనము భగవంతుడు దగ్గరకు వెళ్ళినా, గురువు దగ్గరకు వెళ్ళినా ఆయన దయ, అనుగ్రహం తప్పించి ఇంకేమీ కోరుకోవద్దు.**

జాగ్రత్తగా ఉంటాం, అంటే తలంపు విషయంలో అజాగ్రత్తగా ఉంటే మనం చేసే పనులు కూడా అజాగ్రత్తగానే ఉంటాయి. తలంపుని బట్టి పని ఉంటుంది కాబట్టి తలంపుల విషయంలో మీరు ఎక్కువ జాగ్రత్తపడాలి. అందుచేత ఒక అరగంట సేపు పూజ చేస్తే ఒక అరగంట సేపు జపం చేస్తే అక్కడితోటి మన పని పూర్తి అయిపోయినట్టు కాదు. ఇరవై నాలుగు గంటలు జాగ్రత్త పడాలి. అందుచేత కఠోపనిషత్తులో "కత్తి అంచు మీద నడిచే మనిషి ఎంత జాగ్రత్తగా ఉండాలో, ఈ ఆధ్యాత్మిక జీవితంలో కూడా అంత జాగ్రత్తగా ఉండాలి" అని చెప్పారు. కొంతమంది మాకు ఇంకా మోక్షం రావటం లేదేమిటి అని కంగారు పడతారు. మీరు ఎంతకాలం అయినా సరే ఓపిక పట్టాలి. ఇప్పుడు కాకపోతే వెయ్యి జన్మల తరువాత ఇస్తాడు మోక్షం. అది కాదు ఓపిక పట్టాలి. ఈశ్వరుణ్ణి బలవంతం చేయకూడదు. నిరీక్షణ అవసరం, ఈఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన ప్రతీవాడికి కూడా ఓర్పు ఉండాలి. ఆ కాలం కోసం నిరీక్షించాలి. కంగారు పడకూడదు, ఈశ్వరుడిని బలవంతం పెట్టకూడదు. ఈశ్వరుడిని బలవంతం పెడితే అది శరణాగతి అవుతుందా? అసలు ఈ నేను అనే తలంపు లేకముందు మనం ఉన్నాము. ఈ నేను నేను అనే తలంపు పోయిన తరువాత కూడా మనం ఉంటాం. శరీరం రాకముందు మనం ఉన్నాం, ఈ శరీరం మరణించిన తరువాత కూడా మనం ఉంటాం, ఇవి మధ్యలో వచ్చినవి అందుచేత మధ్యలోనే పోతాయి.

నేను పుట్టిన చోటు నువ్వు వెదకి చేరక నేను పుట్టని తన నాశనము పొందుట ఎట్లు? నేను అనే తలంపు ఎక్కడ నుంచి పుడుతోందో ఆ పుట్టిన చోటు వెతకాలి. వెతికి ఆ పుట్టిన చోటు పట్టుకోవాలి. చెరువులో మనది ఒక వస్తువు పడిపోయింది అనుకోండి. అప్పుడు మనం చెరువులో మునిగి వెతికి ఆ వస్తువును బయటకి తెచ్చుకుంటున్నాం. అంటే మన వాక్కును బంధిస్తున్నాం, ప్రాణాన్ని బంధిస్తున్నాం, వీటన్నింటినీ బంధించి చెరువులో మునిగి ఆ వస్తువును తెచ్చుకుంటున్నాం. అదే విధంగా మీ వాక్కును బంధించి, మనసుని బంధించి, ప్రాణాన్ని బంధించి ఆ నేను అనే తలంపు యొక్క మూలాన్ని తెలుసుకో. మనం చెరువులో పడిపోయిన వస్తువు కోసం వాక్కును బంధించి, ప్రాణాన్ని బంధించి లోపలికి మునిగి ఆ వస్తువును ఎలా అయితే తెచ్చుకుంటున్నామో అలాగే మీరు మీ వాక్కును బంధించి, మనసుని బంధించి, మీ ప్రాణాన్ని బంధించి, మీ హృదయంలో ఉన్న ఆత్మ ముత్యాన్ని పట్టుకోండి, అంటే మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి, మీరు ఇంటిదగ్గర చేసుకునే

పనులలో అహంకారం యొక్క విజృంభణ తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయండి. చేతనైనంత వరకు స్వార్థాన్ని తగ్గించుకోండి. మనం స్వార్థం లేకుండా పని చేయడానికి అలవాటు పడ్డాం అనుకోండి అప్పుడు మనసులో ఉన్న మాలిన్యం, మనసులో ఉన్న మురికి అంతా రాలిపోతుంది. మీరు ఏదైనా మాట్లాడేటప్పుడు ఆడంబరం లేకుండా మాట్లాడండి. మీరు ఇంటిదగ్గర జీవించేటప్పుడు ఆడంబరం లేకుండా జీవించండి. సమాజంలో మీకు ఉన్న సంబంధబాంధవ్యాల విషయంలో ఆడంబరం లేకుండా ఉండండి. భాషలో నిరాడంబరంగా ఉండాలి, వేషంలో నిరాడంబరంగా ఉండాలి, మాటల్లో నిరాడంబరంగా ఉండాలి, జీవితంలో ప్రతీ చేష్ట కూడా నిరాడంబరంగా ఉండాలి. అది తపస్సు.

మీరు ఏ పని చేసినా ఈశ్వరుడి ప్రీతి కోసమే చేయాలి. లోకం యొక్క మెప్పు కోసం కాదు. ఎందుచేత అంటే మన తాళం చెవి ఈశ్వరుడి చేతిలో ఉంది. కుండ మీద ఉన్న మూత తీస్తేనే కానీ లోపల అన్నం ఉన్నా కనపడదు. అదే విధంగా మన హృదయంలోనే సుఖం ఉంది, మన హృదయంలోనే శాంతి ఉంది, కానీ అహంకారం అనే మూత తియ్యాలి. ఈ అహంకారం అనే మూత తియ్యాలి అంటే మన ప్రయత్నం, మన తెలివితేటలు ఒక్కటే సరిపోవు. ఈశ్వరుడి యొక్క సహాయం కావాలి. ఈశ్వరుడి సహాయం ఎప్పుడు వస్తుంది? మనం హృదయ పూర్వకంగా సాధన చేసినప్పుడు ఈశ్వరుడి సహాయం వస్తుంది. సాధన అంటే ఏమిటి? ప్రయత్నం. సాధన అంటే ఏమి లేదు భగవంతుని తెలుసుకోవటానికి మనం చేస్తున్న ప్రయత్నమే సాధన. అలా హృదయపూర్వకంగా ఎవరైతే ప్రయత్నం చేస్తున్నారో, వాళ్లకి ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది. మనకి స్వార్థం పెరుగుతుంటే దేహాత్మబుద్ధి పెరుగుతుంది. మనకి స్వార్థం పెరిగిపోతోంది అనుకోండి దేహభావన పెరుగుతూ ఉంటుంది. మనకి దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధి లేదు. అందుచేత ఏ పని చేసినా దేవుడిని దృష్టిలో పెట్టుకుని పని చేయాలి. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, ఏ పని చేసినా సరే భగవంతుడిని దృష్టిలో పెట్టుకోండి. శాంతి, సుఖం, సంతోషము, ఆనందము, ఇవన్నీ ఎక్కడో బయట లేవు మీ హృదయంలోనే ఉన్నాయి. అవి మనకి అందుతాయి. ఎప్పుడు? మనం ఆడంబరం విడిచి పెట్టినప్పుడు. స్వార్థం విడిచి పెడితే ఆడంబరం విడిచి పెడితే మనలోని శాంతి మనలోని సుఖం మనకు అందుతాయి. దైవరాజ్యం మన హృదయంలోనే ఉంది, అప్పుడు ఆ దైవరాజ్యానికి మనం వారసులం అవుతాము.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**మన్మనాభవమద్భక్తోమద్యాజీ మాం నమస్కురు।**

**మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోసి మే ॥ 18-65॥**

**తాత్పర్యము :** ఓ అర్జునా! నీవు నాయందే మనస్సును నిలుపుము. నా భక్తుడవు కమ్ము. నన్నే సేవింపుము. నాకు ప్రణమిల్లుము. ఇట్లు చేయుట వలన నన్నే పొందగలవు. ఇది ప్రతిజ్ఞా పూర్వకముగా నేను చెప్పుచున్న మాట. ఏలనన నీవు నాకు అత్యంత ప్రియుడవు.

నువ్వు నాకు భక్తుడవు అవ్వు అని భగవంతుడు అడుగుతున్నాడు. నాయందు నీ మనస్సును నిలబెట్టు, నాకు భక్తుడవు అవ్వు. నువ్వు కళ్ళు మూసుకుంటే నా రూపాన్ని ధ్యానం చెయ్యి. నోటితోటి నా నామాన్ని స్మరించు. కళ్ళు మూసుకుంటే నీ హృదయములో నా రూపాన్ని ధ్యానం చేసుకో, కళ్ళు తెరిస్తే నా రూపాన్ని చూస్తూ ఉండు. నోటిలో నాలుక ఉంది కదా, ఆ నాలుకతోటి నా నామాన్ని స్మరించుకో. నాకు భక్తుడవు అవ్వాలంటే, నీ కళ్ళు నాకు ఇచ్చేయి, నీ నాలుక నాకు ఇచ్చేయి, నీ చేతులు నాకు ఇచ్చేయి. అన్నీ నాకు ఇచ్చేయి. ఇంక మనని ప్రకృతి ఏమి బాధ పెడుతుంది? ఇంక మనం బాధ పడేది ఏముంది? ఇంద్రియాలు నిగ్రహించటం ఎందుకు, అన్ని ఇంద్రియాలు భగవంతుడికి ఇచ్చేస్తుంటే ఇంక ప్రత్యేకంగా కష్టపడి నిగ్రహించటం ఎందుకు? మనం నూటికి నూరుపాళ్ళు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఇంక హాస్పిటలుకి వెళ్ళటం ఎందుకు? మనకి వికారాలు లేనప్పుడు ఈ నుంచోవటం కూర్చోవటం ముక్కులో గాలి చూసుకోవటం ఇవన్నీ ఎందుకు? ఇవన్నీ భక్తి

లేక చేసే పనులు, భగవంతుడి మీద భక్తి లేకపోతే ఇలా రోడ్ల మీద తిరగాలి! దీనికి మళ్ళీ ప్రత్యేకంగా ట్రైనింగులు, వారం రోజుల కోర్సులు! భక్తి లేకపోవటం వల్ల వచ్చిన తింగరితనం ఇదంతా!

నా భక్తుడవు అవ్వు. నువ్వు కళ్ళు మూసుకుంటే నా రూపాన్ని ధ్యానం చేసుకో. నీ నోటిలో నాలుకతో నా నామాన్ని స్మరించుకో. నాలుకని కూడా ఇచ్చేయమంటున్నాడు. నువ్వు ఏదైనా వింటావు అనుకో, ఎవరైనా నలుగురు కలుసుకుంటే, నాకు సంబంధించిన మాటలు నేను చెప్పిన మాటలు చెప్పుకోండి. నీ చెవులు కూడా నాకు ఇచ్చేయి. చెవులు ఇచ్చేయమంటున్నాడు, కళ్ళు ఇచ్చేయమంటున్నాడు, నాలుక ఇచ్చేయమంటున్నాడు, మనస్సు ఇచ్చేయమంటున్నాడు. ఇవన్నీ ఇచ్చేసాక ఇంకా సాధనకి ఏమి మిగులుతుంది? మీరందరూ జ్ఞానులు అయిపోతారు, మీకు తెలియకుండా అయిపోతారు!

మనం రైలులో బెర్తు తీసుకుంటాము, భీమవరంలో ఎక్కి పడుకుంటాము, హైదరాబాదులో లేస్తాము. మధ్యలో గుడివాడ స్టేషను వస్తుంది, విజయవాడ వస్తుంది, ఇంకో స్టేషను వస్తుంది. మనకేమీ తెలియదు, హైదరాబాదు లో లేస్తాము. అలాగ నీకు ఏమీ తెలియకుండా ఇంద్రియనిగ్రహము వచ్చేస్తుంది, మనోనిగ్రహము వచ్చేస్తుంది. నీ గమ్యానికి వచ్చేసి నా హృదయంలో జాయిన్ అయిపోతావు. నువ్వు ఎక్కడా పెత్తనాలు చెయ్యనక్కరలేదు. నాలో జాయిన్ అయిపో! నువ్వు నాలో కలిసిపో అంటున్నాడు. నువ్వు ప్రత్యేకంగా ఏదో చేస్తాను అంటున్నావు, అవన్నీ ఎందుకు నాలో కలిసిపో. ఆ తిప్పలు అన్నీ నువ్వు పడలేవు అంటున్నాడు. నాలో జాయిన్ అయిపో వచ్చి నువ్వు. జనప్రవాహంవెళ్తోంది హృదయంలోకి, ఒక మహా ప్రవాహం వెళ్తోంది, అందులో జాయిన్ అయిపోయి వెళ్ళిపో. నువ్వు పెత్తనాలకి వెళ్ళకు. నువ్వు చెయ్యవలసింది నాలో జాయిన్ అయిపోవటమే, నువ్వు నన్నేమీ కనిపెట్టక్కరలేదు.

మద్భక్తః - నాకు భక్తుడవు అవ్వు. మద్యాజీ మాం నమస్కురు - నన్ను పూజించు, నాకు నమస్కరించు. ఇవన్నీ ఎందుకు చెపుతున్నాడు అంటే, ఆయన పట్ల మనకి విశ్వాసం పెరగటానికి, ప్రేమ కలగటానికి. భగవంతుడి రూపాన్ని పూజించటం వల్ల కూడా మనస్సు అణుగుతుంది. మన పెద్దలు రోజూ స్నానం చేసిన తరువాత ఇష్ట దైవాన్నిపూజ చెయ్యమని ఎందుకు చెప్పారంటే, పూజ వలన మనస్సు అణుగుతుంది, ఇంద్రియాలకి నిగ్రహం వస్తుంది. తరువాత ఎప్పుడైతే పూజ చేస్తున్నామో, ఆ పూజ గురించి వాడికి టైముకి మెలుకువ వస్తుంది.

ఎప్పుడైతే టైముకి నిద్ర లేచాడో, మిగతా పని అంతా కరెక్టుగా టైముకి చేసుకెళ్ళిపోతాడు. నన్ను పూజించు, నన్ను స్మరించు, నీ హృదయంలో నన్ను నిలబెట్టుకో.

ఇప్పుడు మనం ఏమనుకొంటున్నాము అంటే మనమూ ఉన్నాము ఆయనా ఉన్నాడు అనుకొంటున్నాము. నిరంతరమూ ఆయననే చింతిస్తూ ఉంటే, ఉన్నది ఆయనే, మనం ప్రత్యేకంగా లేము అనే అనుభవం వస్తుంది. అదే అద్వైతానుభవం, అదే అమృతానుభవం, అదే చిటారుకొమ్మ. మీకు తెలియకుండా మీకు అద్వైతానుభవం వస్తుంది. ద్వైతం లోనుంచి అద్వైతం లోకి వచ్చేస్తారు, అమృతానుభవంలోకి వచ్చేస్తారు. మీ శవాలు భూమి మీద తిరుగుతూ ఉండగానే అంతులేని సుఖం, శాంతి, ఆనందం మీ అనుభవం లోకి వస్తుంది. ఎండ్లెస్ హేపీనెస్! మీరు క్షీరాన్నం నోటిలో వేసుకొంటే, అది నోటిలో ఉన్నంత సేపే ఉంటుంది. ఇది అలా కాదు, ముగింపు లేని సుఖం, ముగింపు లేని శాంతి, ముగింపు లేని ఆనందం. ఈ ఆనంద ప్రవాహంలో, ఈ జ్ఞాన ప్రవాహంలో, ఈ శాంతి ప్రవాహంలో మీ శరీరం ఉన్నా పడిపోయినా మీకేమీ అనిపించదు. అది జీవన్ముక్తి. శరీరం ఉండగా ముక్తుడు, శరీరం పోయిన తరువాత ముక్తుడు.

భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే ఆయన చుట్టూ తిరగమంటున్నాడు. నువ్వు ఏదైనా పని చేస్తే నా యొక్క ప్రీతి కోసం పని చెయ్యి అని చెపుతున్నాడు. ఏదైనాపని చేసినా ఆయన చుట్టూ ఉండాలి, ఏదైనా విన్నా ఆయన చుట్టూ ఉండాలి. ఏదైనా మాట్లాడినా ఆయన మాటలే మాట్లాడాలి. ఒకవేళ ఎవరికైనా సహాయం చేసినా, మనకి ఎల్లమ్మ పుల్లమ్మ గొడవ వద్దు. అక్కడ అంతర్యామిగా ఆయనే ఉన్నాడు, అందరి హృదయాలలో ఆయనే ఉన్నాడు కాబట్టి, ఆయననే చూసి చెయ్యి. ఆయననే చూసి చేస్తే, వాళ్ళకి ఉపకారం చేసాము, మళ్ళీ వాళ్ళు మాకు ఏమీ ఉపకారం చెయ్యలేదు, వాళ్ళకి కృతజ్ఞత లేదు, ఇటువంటి వ్యర్థమైన తలంపులు, వ్యర్థమైన ఆలోచలు, వ్యర్థమైన సంకల్పాలు రావు.

అందుచేత నువ్వు నాకు నమస్కరించు, నన్ను పూజించు, నాకు భక్తుడవు అవ్వు. ఇవన్నీ చెయ్యగా చెయ్యగా, నీకు తెలియకుండా నాలో ప్రవేశిస్తావు.


మామే వైష్యసి - నీకు తెలియకుండా, నది వెళ్ళి సముద్రంలో ఎలా ప్రవేశిస్తుందో, అలా నాలో ప్రవేశిస్తావు. అప్పుడు నీ రూపంనుంచి, నీ నామంనుంచి, నీకు తెలియకుండానే విడిపోతావు. అంటే, నీకు ఏమీ తెలియకుండానే సర్జరీ జరిగిపోతుంది. సాధన చేస్తున్నాను అని నీకు తెలియకుండానే సాధన అయిపోతుంది, నువ్వు సిద్ధపురుషుడవు అయిపోతావు.

నా స్వరూపాన్ని పొందుతావు. మా మేవ - నన్నే పొందుతావు

నువ్వు నాకు ఇష్టుడవు అని ముందే చెప్పాను కదా, నీకు సత్యం చెపుతానా, అసత్యం చెపుతానా! నువ్వు నాకు ఇష్టుడవు అయినప్పుడు, నిన్ను నేను ప్రేమిస్తున్నప్పుడు, నీకు మంచి చెపుతానా, చెడు చెపుతానా, సత్యం చెపుతానా, అసత్యం చెపుతానా! చెడ్డ చెప్పను, మంచేచెపుతాను. నీకు అసత్యం చెప్పను, సత్యమే చెపుతాను. నీకు ఏదైతే హితవో, నీకు ఏదైతే క్షేమమో అదే చెపుతాను కానీ నీకు క్షేమం కానిది చెప్పను. ఇంత గోల ఏల, నువ్వు నాకు హితుడవు అని చెప్పినప్పుడు, నీకు క్షేమం కలగచేసే మాటలు, నీకు మంచి కలగచేసే మాటలు, నువ్వుఉద్ధరింపబడే మాటలు, బాగు పడే మాటలు చెపుతాను కాని, చెడ్డ మాటలుచెపుతానని ఎందుకు అనుకోవాలి నువ్వు అర్జునా.

సత్యం తే ప్రతిజానే - ఇప్పుడు నేను నీకు చెప్పిన నాలుగు మాటలు అసత్యము కాదు, సత్యము అని నీకు వాగ్దానం చేసి చెపుతున్నాను. జీవుడు తొందరగా నమ్మడు దేవుడిని. అందుకే అంత గట్టిగా నీకు వాగ్దానం చేస్తున్నాను! నేను చెప్పిన పద్ధతిగా నువ్వు ఉంటే నాలో ఐక్యం అయిపోతావు, ఇది అసత్యము కాదు, సత్యమే. సత్యము కూడా నీకు వాగ్ధానము చేసి చెపుతున్నాను.

ప్రతిజానే ప్రియోసి మే- అర్జునుడు అంటే ఋజు ప్రవర్తన కలవాడు, ధర్మ ప్రవర్తన కలవాడు. తెల్లటి వాడు, స్వచ్ఛమైన వాడు. అంతే కాకుండా ఆయన భక్తుడు అయ్యి ఉన్నాడు. భక్తుడు కాకపోయినా, బాగుపడటానికే భక్తుడు అవ్వమని అడుగుతున్నాడు. ఎలా జీవిస్తే నువ్వు శాశ్వతమైన శాంతిలో ఊగిసలాడతావో, ఎలా ఉంటే నా స్వరూపాన్ని నువ్వు పొందుతావో ఈ సబ్జెక్టు అంతా, ఇది సత్యమే అయినప్పటికీ, వాగ్దానం చేసి ఎందుకు చెపుతున్నానంటే నువ్వు నాకు ప్రియుడవు కాబట్టి. అలా చెయ్యగా చెయ్యగా చివరికి నువ్వు నాలో ఐక్యమయిపోతావు. నువ్వు అర్జునుడవు, వీడు కృష్ణుడు అనే బేధం తెలియకుండా ఐక్యమయిపోతావు! నది వెళ్లి సముద్రంలో కలిసాక, ఇది సముద్రంలో నీరు, ఇది నదిలో నీరు, ఇది మురుగుకాలువలో నీరు, ఇది పంటకాలువ నీరు అనే బేధం ఉండదు. అన్నీ ఏకం అయిపోతాయి. వీడు అర్జునుడు వీడు కృష్ణుడు అనే బేధం లేకుండా ఐక్యం అయిపోతావు అర్జునా. నా స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తాను, నా అంతటి వాడిని చేసి నిన్ను విడిచిపెట్టేస్తాను.



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

**మోహము ద్రప్పి నీ మొహమొనర్చి**

**నా మోహము తీరదా అరుణాచలా!**

తాత్పర్యము: ప్రకృతి మైకము లోనున్న నాకు నీ ప్రేమను రుచి చూపించి, నీమీద నాకు మోహము కలిగించావు.  మరి "నిన్ను-నన్ను" వేరుచేస్తున్న నీ మోహము లోనుంచి నన్నెప్పుడు విడుదల చేస్తావు అరుణాచాలా!

మోహము త్రిప్పి నీ మోహమొనర్చి నా మోహము తీరదా అరుణాచాలా! లోకంలో ఉన్న రూపాలు నామాల మీద నాకు మోహం ఏమీ లేదు. ఇప్పుడు నీ మోహం పట్టుకుంది నాకు, అంటే అరుణాచలేశ్వరుడి మోహం పట్టుకుంది. నేను నిన్ను మోహించాను. నీ ప్రేమలో నేను పడ్డాను. నీ మోహంలో ఎందుకు పడ్డానంటే, నాకున్న మోహం తీసేస్తావని, నాకున్న దేహ మోహం, నాకున్న లోక మోహం తీసేస్తావని, నీ మోహంలో పడ్డాను. ఓ అరుణాచలేశ్వరుడా, నీ మోహంలో పడ్డాను కాబట్టి నా మోహం తీసేయి. నీ మోహంలో పడటం కూడా మోహమే. నిన్ను స్మరించటం కూడా మోహమే. అయితే లోకం యొక్క మోహం పోవటం కోసం నీ మోహంలో పడ్డాను.

ఓ అరుణాచలేశ్వరుడా, నిన్ను ప్రేమిస్తున్నాను, నిన్ను ధ్యానిస్తున్నాను. లోకంలో విషయాలు స్మరించటం మానేశాను. నిన్ను స్మరిస్తున్నాను. లోకంలో విషయాలు ధ్యానించటం మానేశాను. నిన్నే ధ్యానం చేస్తున్నాను. నిన్ను తలపెట్టుకొంటున్నాను. నా హృదయం నిండా నువ్వే ఉన్నావు. నిన్ను తలపెట్టటం మట్టుకు మోహం కాదా, నిన్ను స్మరించటం మట్టుకు మోహం కాదా, నిన్ను ప్రేమించటం మట్టుకు మోహం కాదా. అది కూడా మోహమే నయ్యా,

నేను కాదనటం లేదు. నాకున్న లోకం యొక్క జ్వరం, నాకున్న విషయాల యొక్క జ్వరం, తగ్గిపోవటం కోసం నీ మోహంలో పడ్డానయ్యా! ఆ మోహం అంతా పోయిన తరువాత నీ మోహం కూడా తీసెయ్యి అరుణాచలేశ్వరుడా!

నాకు లోకం మీద మోహం తీరిపోయింది. లోకానికి సంబంధించిన తాదాప్యం పోగొట్టుకున్నాను.లోకంలో ఎన్ని ఆకర్షణలు ఉన్నా, ఏదీ నన్ను ఆకర్షించటం లేదు. కానీ నీమీద మోహం ఉంది, నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి పోలేదు. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి పోవాలంటే, అది నా తెలివితేటల వలన పోగొట్టుకోలేను. ఆ బేధబుద్ధిని పోగొట్టవలసింది నువ్వే. నీ యందు ప్రేమ ఉంది, మోహం ఉంది. నీ మీద ఉన్న మోహం పోతేనేగాని నా స్వరూపం తెలియదు. నువ్వు నాకు వేరుగా కనిపిస్తున్నావు. నువ్వు నాకు స్వరూపంగా దర్శనం ఇవ్వాలి. ఇప్పుడు నువ్వు నాకు భిన్నంగా కనిపిస్తున్నావు, భేదంగా కనిపిస్తున్నావు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి రాకూడదు నాకు. బేధబుద్ధి వస్తే అది పరమస్థితి కాదు, చివరిస్థితి కాదు. బేధబుద్ధి ఉన్నప్పుడు మళ్ళీ ఏదో వరాలు అడగాలి అనిపిస్తుంది. నువ్వు నాకు స్వరూపంగా కనపడాలి. నాలో ఉన్న నిజమైన నేనుగా వ్యక్తమవ్వాలి. నువ్వు నాలో చైతన్యంగా వ్యక్తమవ్వాలి. నాకు బేధబుద్ధి పోయి, అభేదబుద్ధి రావాలంటే నువ్వు స్వరూపంగా వ్యక్తమవ్వాలి అని రమణస్వామి అక్షరమణమాలలో ప్రార్థించారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సంగులకు) రుగు 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రుగు 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762
INDIAN BANK, VEDANGIPALEM BRANCH
IFSC Code : IDIB000V142, Contact No. 9866715896

# మహా నిర్వాణం

కాల ప్రవాహంలో అనేకమంది ఈ భూమి మీదకు మానవ శరీరం ధరించి రావడం, కొంతకాలం ఇక్కడ శరీరంతో ఉండడం, చివరికి శరీరాలు విడిచిపెట్టడం, మనము చూస్తూనే ఉంటాము! 'అహంకారం' నశించకుండా శరీరం విడిచిపెట్టే వారికి, ఏ ప్రత్యేకతా ఉండదు. కానీ జ్ఞాని శరీరం విడిచిపెట్టడానికి, ఒక ప్రత్యేకత ఉంది. అప్పటికే వాస్తవంగా, తాను ఎవరో? అనుభవైకవేద్యం చేసుకొని, ఎరుకతో, సాక్షిగా, శరీరాన్ని విడిచిపెడతారు; దానినే మహానిర్వాణం అంటారు. ఏప్రియల్ 14, 1950న భగవాన్ శ్రీరమణుని భౌతికరూపం కనుమరుగైంది. ఆ క్షణం నుండి దేహధారిగా, భగవాన్ ఇకలేరు! భగవాన్ మరణించారు అనగలమా? ఆ మాటకు అర్థము ఏమైనా ఉందా? సర్వవ్యాపికి, ఆత్మకు, మరణించడం ఉంటుందా? నేను ఎక్కడికి పోతున్నాను, నేను ఎక్కడికి పోగలను, నేను ఎప్పుడూ మీతోనే ఉంటాను అని భగవాన్ ఆ రోజున ఇచ్చిన హామీని అప్పుడు, ఇప్పుడు, నిరంతరం, ప్రత్యక్షం చేస్తున్నారు! భగవాన్ శ్రీరమణుడు మృత్యుంజయుడు, అనగా దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధినుండి విడుదల పొంది 'తాను' అమృతుడయ్యాడు! "కేవలం ఉన్నదేదో ఉంది. అదే సత్యం! అదే నేను! తదితరమంతా సత్యము యొక్క ఆభాస మాత్రమే! అంటారు భగవాన్". అదేవిధముగా గురువు అంటే శరీరము కాదు. జనన మరణ సంసార చక్రం అనే మహావ్యాధి నుండి విడుదల పొంది, ఆత్మ సామ్రాజ్యానికి అధిపతియైన భగవాన్ వంటి వారికి, చనిపోవడం అనే మాటకు అర్థం ఏముంది? గొప్ప అబద్ధం శరీరం చనిపోవడం! జనన మరణాలు వ్యవహారిక సత్యములు మాత్రమే! భగవాన్ నిర్యాణంతో దేహగతమైన, వ్యవహారికమైన, యాత్ర సమాప్తం అయిందే గాని, నిజమైన భగవాన్ ఉనికికి మరణం లేదు. భగవాన్ వచ్చారు, ఉన్నారు, వెళ్ళారు అనుకుంటే పొరపాటే! అనంతమైన, నిత్యమైన, ఆత్మకు రాక పోకలు లేవు.

**(తారీఖు ప్రకారం ది॥ 14-04-2021 భగవాన్ శరీరం విడిచిపెట్టిన రోజు)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆధ్యాత్మిక శిఖరాన్ని అధిరోహించాలంటే అహంకారం వదులుకోవాలి

అహంకారం తన లాభాన్ని కూడా ఎరుగని మూర్ఖురాలు, స్వయంగా అది కాలును, వలలో చిక్కుకుని అత్యంత దుఃఖితురాలు అవుతుంది. అందుకే మనం ఎంతో నేర్పుగా, తెలివిగా అహంకారాన్ని వశం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. దానికి సద్గురు కృప ఎంతగానో అవసరం. ఆయన మనకు నామోపదేశాన్ని ఇచ్చిన తరువాత మరునాడే ఆయన తన శరీరాన్ని విడిచిపెట్టిన మనము మన ధ్యాసను సడలనియ్యకుండా వారి రూపాన్ని వారి కల్యాణగుణాలను ఎల్లప్పుడూ ధ్యానించాలి. వారు మనలను సత్యధామానికి చేర్చి తీరుతారు. సద్గురువు మనం అడిగినవన్నీ ఇస్తూ ఎప్పుడూ అలసిపోడు. ఆ కోరికలు పొంది మనమే అలసిపోతాము. గురువు ఎదుట అది కావాలి, ఈ అవసరం మనం నిత్యం ప్రార్థిస్తూ ఉంటాము. ఒకవేళ ఈ జన్మలో అవి తీరకపోయినా మరుజన్మ ఇస్తాడు. ఆ తృష్ణ నుండి విసిగి వేసారి ఎప్పుడైతే భగవంతుడు ఒక్కడే కావాలని అంటామో అప్పడే దయతో తనలో ఐక్యం చేసుకుంటాడు. ఇది సిద్ధాంతం. మనం మన మనస్సును బలవంతంగా ప్రపంచ విషయాలపట్ల విముఖిత చూపటానికి ప్రయత్నం చేస్తాము. మొదట్లో అలాగే జరుగుతుంది కానీ అది సత్యాన్ని పట్టుకోలేక ప్రకృతిలో తిరగటానికి మరలా మొదలుపెడుతుంది. దాని అలవాట్లను స్వభావాన్ని నిరంతరం అర్థం చేసుకొని నిరోదించాలి. మనం ఈ ప్రపంచంలో మన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ సాధన చేసుకోవాలి. అడవులకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లటానికి ప్రయత్నించకూడదు. ఇక్కడే ఉండి హుందాగా జీవించాలి. ప్రాపంచిక మాలిన్యాన్ని అంటుకోకుండా జీవించాలి. మనం పిల్లలుగా ఉన్నప్పడు తీర్థంలో రంగుల రాట్నం, మిఠాయి కొట్లు అన్నీ ఆహ్లాదంగా చూస్తాము. తండ్రి చేయి పట్టుకొన్నంతసేపు చూస్తూ ఆనందిస్తాము, పొరపాటున తండ్రి చేయి వదిలి మారిపోతే పైన వస్తువులన్నీ అక్కడే ఉన్నా ఆహ్లాదించవు. అలాగే మనం సద్గురువులో లీలమై ఉన్నంత వరకూ అంతా ఆనందమే. ఆయన్ని వదిలి మిత్రులతోనూ, లోక పదార్థాలతోనూ ఆనందించటానికి మొదలుపెడితే దుఃఖమే కలుగుతుంది. విషయాలను వీడనంతకాలం వెలితి, విషాదం మనలను వదలదు. నేర్చినవన్నీ మరచిపోవటమే మోక్షం. సాధుకుడు అన్నింటికంటే ముందు సోమరితనాన్ని వదిలిపెట్టాలి. తరువాత ప్రపంచాన్ని వదలటానికి ప్రయత్నించాలి. మనం ప్రపంచ బాధ్యతల నుండి వదలటానికి ప్రయత్నించకూడదు. ఉత్సాహకరమైన ఆధ్యాత్మిక జీవితమో లేక సంసార లంపటానికి దిగజార్చే వైవాహిక జీవితమో తెలివిగా ఎన్నుకోవాలి, గతంలోకి జారిపోకూడదు. పరిస్థితులకు బానిస కావద్దు. అద్భుతంగా ఉండాలి. జాగృతిలో ఉండాలి. జ్ఞాన మార్గస్తులకు గాని, భక్తి మార్గస్తులకు గాని గురుభక్తికి మించిన సాధన లేదు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966